అవధాన పుష్కరిణి

అంతర్జాల మాసపత్రిక

సంపుటి: 1 సంచిక: 11 పరాభవ - ఆషాఢ శుద్ధ విదియ, 16 జూన్ 2026

పోకూరి కాశీపత్యవధాని

(27.01.1893 - 27.12.1974)



భూరి జరర గురుడు నీరజాంబికభూతి
మహితకరుడహీనమణికలాపు
డలఘు సద్గణేశు డగ్రగోపుడు మహా
మర్త్య సింహుడేలు మనల నెపుడు

ప్రచురణ

అవధాన విద్యా వికాస పరిషత్

భాగ్యనగరం

అవధాన విద్యా విజయతే తరామ్

12/7/26న శృంగేరీ శంకరమఠంలో జరిగిన **తాతా సందీప్ శర్మ** అష్టావధానం

11-07-2026, శ్రీ భారతీ తీర్థ గ్రంథాలయం , దర్శనమ్ పత్రిక కార్యాలయంలో,
నెలనెలా అవధాన దర్శనమ్ కార్యక్రమంలో భాగంగా **చి. నరసింహదేవర జయలక్ష్మి** (13సం.ల బాలిక)
పండిత ప్రకాండుల మధ్య చేసిన సంస్కృత అష్టావధానం.

అవధాన పుష్కరిణి

సంపుటి - 1 | అంతర్జాల మాస పత్రిక | సంచిక - 10

పరాభవ - ఆషాఢం 2026 16-07-2026 ప్రచురణ: అవధాన విద్యా వికాస పరిషత్

శ్రీయుతమై రసైకలహరీసితమై, వివిధావధాన వి
ద్యాయతధీకవీశ్వరులు తామరలై విరియన్ - తదీయ వి
జ్ఞేయ సుపద్యమాధురు లశేషబుధాళుల కిందు విందుగా
నీ యవధాన పుష్కరిణి - ఈప్సితమై వెలుగొందు నందమై

– డా. జి.యం.రామశర్మ, శతావధాని

సంపాదక వర్గం

ప్రధాన సంపాదకులు

మరుమాముల దత్తాత్రేయశర్మ

సహసంపాదకులు

కె.వి.ఎన్. ఆచార్య

కుంతి

గౌరవ సలహాదారులు

నారుమంచి వేంకట అనంతకృష్ణ శర్మ

మరుమాముల వేంకటరమణశర్మ

కంది శంకరయ్య

సంపాదకవర్గం

డా॥ జి.యం.రామశర్మ

ఆముదాల మురళి

డా॥ సంగనభట్ల నరసయ్య

డా॥ మారేపల్లి వేంకట పట్వర్ధన్

ఆచార్య ఫణీంద్ర

చిటితోటి విజయకుమార్

చింతా రామకృష్ణారావు

రూపకల్పన: పంతుల విట్టుబాబు

అక్షరాలంకరణ: విరివెంటి సాహితీసుధ

కార్యాలయం

శ్రీరామ సదనం, 29-1499/6/1,

వెస్ట్ కాకతీయ నగర్, రోడ్ నం.1,

నేరేడుమెట్టు, సికిందరాబాద్ – 500 056

ఫోన్: 9441039146

అవధాన విద్యా వికాస పరిషత్ సేవాకార్యక్రమాలకు ఆర్థికంగా సహకరించదలచిన సహృదయులు ఫోన్ పే ద్వారా స్పందించగలరు.

అవధానవిద్యా విజయతే తరామ్

సంపాదకీయం

అవధాన రణానికి ధారణే ప్రాణం

తెలుగు సాహిత్య వైభవానికి ప్రతీకగా నిలిచిన అవధాన విద్య ప్రపంచ సాహిత్య చరిత్రలోనే ఒక అద్భుత మేధాప్రక్రియ. ఆశుకవిత్వం, చమత్కార బుద్ధి, తార్కికత, వ్యాకరణ పాండిత్యం, ఛందస్సు, అలంకార శాస్త్ర పరిజ్ఞానం వంటి అనేక అంశాలు అవధానంలో కనిపించినప్పటికీ, వాటన్నింటినీ ఒకే దారంలో కట్టిపడేసేది ధారణ. అందుకే “అవధానానికి ధారణే ప్రాణం“ అనే మాట అక్షరసత్యం.

పారణలేని ద్వాదశి, నివారణలేని ప్రయోగ మంత్రమున్
తారణలేని పల్కు,గుణధారణలేని కుజేంద్రువాక్యమున్
హారతిలేనిపూజ, సుమహారములేని లతాంగి కొప్పు, స
ద్ధారణ ధారలేని యవధాని యశంబు గడించ నేర్చునే?

అంటారొకసభలో డా.ధూళిపాళ మహాదేవమణిగారు.

ధారణ అంటే కేవలం జ్ఞాపకశక్తి కాదు. అనేక మంది పృచ్ఛకులు ఒకేసారి అడిగే విభిన్న ప్రశ్నలను, వాటి క్రమాన్ని, నియమాలను, నిషేధాక్షరాలను, దత్తపదాలను, సమస్యలను, గంటల కొద్దీ మనస్సులో నిలుపుకొని, చివరికి వాటిని ఎలాంటి పొరపాటు లేకుండా సమాధానపరచే అసాధారణ మానసిక సామర్థ్యమే ధారణ. ఈ శక్తి లేకుంటే అవధానం కేవలం కవితా ప్రదర్శనగా మాత్రమే మిగిలిపోతుంది.

అవధాని ఒకేసారి ఎనిమిది, వంద లేదా అంతకంటే ఎక్కువ అంశాలను మనస్సులో నిలుపుకొని, వాటిని సమన్వయం చేస్తాడు. ప్రతి పృచ్ఛకుని ప్రశ్నను గుర్తుంచుకోవడమే కాకుండా, ఇప్పటికే చెప్పిన పద్యాల క్రమాన్ని, మిగిలిన సమాధానాలను, విధించిన నియమాలను కూడా మరువడు. ఇదంతా ధారణ వల్లే సాధ్యమవుతుంది. ఆశుకవిత్వం ధారణకు అలంకారం అయితే, ధారణ అవధానానికి ఆత్మస్వరూపం.

నేటి డిజిటల్ యుగంలో సమాచారాన్ని యంత్రాలపై ఆధారపడే అలవాటు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ధారణకు ప్రాధాన్యం మరింత పెరిగింది. అవధాన సాధన యువతలో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, మానసిక క్రమశిక్షణ, పరిశీలన, సమయస్ఫూర్తి వంటి అనేక సద్గుణాలను పెంపొందిస్తుంది. అందువల్ల అవధానాన్ని కేవలం సాహిత్య ప్రక్రియగా కాకుండా, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే మానసిక శిక్షణగా కూడా చూడాలి.

(మిగతా 2వ పేజీలో)

సంస్తుతి

ఉ. శ్రీ రమణీమణీసమద సింధురకుంభలసత్కుచైక కా
శ్మీరజపాసువర్ణతులసీదళకోమలపాటలప్రభా
పూరములేకమై యెడఁద బొల్పగునట్టి మహానురాగ మో
నారుచిరోరువక్షమున నల్వగువెన్నుఁడు మమ్ముఁబ్రోవుతన్.

మ. జనతా సన్నుత సంస్కృతాంధ్రకవితాసామ్రాజ్య సర్వంకషుం
డనురాజత్కవికీవలావలను స్తన్యంబారఁగ్రోలించి పెం
చినగారాపుటనుంగుదల్లి! ననువీక్షింపంగదే సత్కృపన్
జననీ! నీదగుచన్నుదోయిఁ దవుఁగా సంగీతసాహిత్యముల్.

– ***శతావధాని పులుగుర్త వేంకటరామరావు***
26.04.1934

సుహృద్వాణి

జూన్ నెల సంచికలోని సూరం శ్రీనివాసులు గారి కావ్య దోష వివరణ అద్భుతంగా వచ్చింది.

– ***డా. కడిమిళ్ళ వరప్రసాద్***

అవధాని పుష్కరిణి వలన చాలా క్రొత్త విషయాలు నేర్చుకుంటున్నాను. నెలనెలా ఈ జ్ఞానతరంగిణి అందరికి చేరేలా కృషి చేసే మీకు, ఇతర విద్వజ్జనులందరికి కృతజ్ఞతాపూర్వక నమస్కారాలు.

నవగోచరోత్తరంగముఁ
గవితావనజోద్ధృతిన్ ప్రకాశితమై వా
క్సవితృప్రషిక్తమౌ స
త్కవిభృంగప్రియ వధాన ప్రాక్పుష్కరిణీ!

– ***సుసర్ల సుధన్వ***

ఇదీ క్రమణిక

1. కావ్యాస్వాదన 3
2. యతివివేచనము 4
3. పద్యపరీమళం 5,8,23
4. విశిష్ట తెలుగు భాషా వైభవం... 6
5. వ్యాకరణ వరివస్య 10
6. ప్రహేళికా 10
7. నిఘంటుపరిజ్ఞానం... 11
8. అవధానవేదిక 12
9. పూరణతోరణం 14
10. కావ్యశాస్త్రగవేషణ 16
11. అంశావలోకనము – దుష్కరప్రాసలు. 18
12. ఖండశర్కర 20
13. సత్కవిప్రతిభకు తార్కాణం సమస్యాపూరణం .. 22
14. సంస్కృతం సంస్కృతి 24

(1వ పేజీ తరువాయి)

సంపాదకీయం

ధారణ సహజంగా లభించేది కాదు; నిరంతర అధ్యయనం, సాధన, ఏకాగ్రత, గురుకృప, క్రమశిక్షణలతో అది వికసిస్తుంది. ఏ మందులవల్లనో, నాలుకలపై బీజాక్షరాలు వ్రాయడంవల్లనో ధారణ నిలువదు.

ప్రతి అవధాని తన ధారణను పదునుపెట్టేందుకు నిత్యం సాధన చేస్తుంటాడు. ధారణ బలంగా ఉంటేనే అవధానం నిర్దోషంగా, రసవత్తరంగా, ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే విధంగా సాగుతుంది.

తెలుగు సంస్కృతికి మకుటాయమానమైన అవధాన విద్యను భావితరాలకు అందించాలంటే ధారణాభ్యాసానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి. పాఠశాలలు, కళాశాలలు, సాహిత్య సంస్థలు ధారణను పెంపొందించే శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలి. ప్రతినిత్యం కొన్ని పద్యాలైనా కంఠస్థం చేయించాలి. అప్పుడు మాత్రమే అవధాన సంప్రదాయం మరింత విస్తరించి ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రతిభకు నూతన కీర్తిని తెచ్చిపెడుతుంది.

శరీరానికి ప్రాణం ఎంత అవసరమో, అవధానానికి ధారణ అంత అవసరం. **ధారణలేనియవధానము వృథారణమే** కదా! ధారణ లేని అవధానం శబ్దం లేని సంగీతంలాంటిది. కాబట్టి ధైర్యం, ధీశక్తి, ధారణ – ఈ మూడు కలిసినప్పుడే అవధాన కళ తన సంపూర్ణ వైభవంతో వికసిస్తుంది.

యయాతి చరిత్ర

డా. ఆచార్య ఫణీంద్ర

"కంబమయ్యరో! మేలు గలిగించు – నీకొక్క
గరుటాలమంతుని గానుకిత్తు ..
గాౘ్రేడ! మెకముల కదుపు రాజేయుమీ –
జింక నొక్కటి నీకు జేతి కిత్తు ..
మలలమ్మ! వేటలో మాపాల గల్గుమీ –
సింగంపు గొదమ దెచ్చెదము నీకు..
దుగ్గమ్మ! కారుపోతుల లోను జేయుమీ –
తొలిముద్దగా నిత్తు దుంత నొకటి .."
యనుచు దమ వేలుపుల నెల్ల మును దలంచి
వేడుకొని మ్రొక్కి వాకట్టు వ్రేళ్లు గొనుచు
వలను లెస్సైన మిక్కిలి యలరుకొనుచు
వచ్చి యెరుకులు వేటాడ జొచ్చి రపుడు!

పొన్నికంటి తెలగన రచించిన అచ్చతెనుగు కబ్బంలో ప్రథమాశ్వాసం ముగింపుకు ముందు – పల్లెల లోని ప్రజలను క్రూర జంతువుల నుండి రక్షించేందుకు యయాతి మహారాజు వేటకు వెళ్ళాలని వేటగాళ్ళకు ఆదేశాన్ని ప్రకటించడం మనం తెలుసుకొన్నాం. ఇక .. ద్వితీయాశ్వాసం ప్రారంభంలోని ఈ 3వ పద్యంలో, కవి – వేటగాళ్ళైన ఎరుకులు ఆ యా వనాలలో జీవించే తమ ఆటవికులు అందరూ ఆరాధించే స్థానిక దేవుళ్ళను ప్రార్థించి, తగిన సమయం చూసుకొని వచ్చి, వేటకు ఉపక్రమించిన విధానాన్ని వివరిస్తున్నాడు. ముందు ఈ పద్యంలోని అబ్బురపరచే – అచ్చ తెనుగు పదాల గుబాళింపులను ఆస్వాదిద్దాం.

1) కంబమయ్య = స్తంభంలో ఆవిర్భవించిన నరసింహస్వామి; 2) గరుటాలమంతుడు = గరుత్మంతుడు; 3) కాౘ్రేడు = కాటి రేడు (శ్మశాన మేలెడి వాడైన శివుడు); 4) మెకము = మృగము; 5) కదుపు = సమూహము; 6) రాజేయు = రాజబెట్టు (మోహరించు); 7) మలలమ్మ = కొండల అమ్మ (గిరి పుత్రిక అయిన పార్వతి); 8) కొదమ = కోడె వయసు పిల్ల; 9) దుగ్గమ్మ = దుర్గమ్మ (దుర్గమ ప్రదేశాల నేలెడి దుర్గాదేవి లేక పార్వతి); 10) కారుపోతు = అడవి దున్న; 11) లోనుజేయు = వశపరచు; 12) తొలిముద్ద = మొదటి నైవేద్యం; 13) దుంత = దున్న పోతు; 14) వాకట్టు = వాయి కట్టు (నోరు మూయించడం); 15) వాకట్టు వ్రేళ్ళు = నోరు కట్టి వేసే చెట్టు మూలికలు (ఒక రకంగా మంత్ర మూలికలు); 16) వలను = దిక్కు, శకునము, అనుకూల్యము.

"ఓ నరసింహ స్వామీ! మాకు మేలు చెయ్యి! – నీకు ఒక గరుత్మంతుని (అనగా .. ఒక గరుడ పక్షిని పట్టి తెచ్చి) కానుకగా ఇస్తాం. ఓ పరమ శివా! వేటాడేందుకు వీలుగా అడవి జంతువుల సమూహాన్ని మా ముందు మోహరించు! – నీ కొక జింకను పట్టి తెచ్చి అందిస్తాం. మల్లమ్మ రూపంలో ఉన్న పార్వతీమాతా! వేటలో మా పక్షం వహించు! – ఒక కొదమ సింహాన్ని నీ కొరకు పట్టి తెస్తాం. ఓ దుర్గమ్మ తల్లీ! అడవి దున్నలను మాకు దక్కేలా చూడు! – మొదటి నైవేద్యంగా ఒక దున్నను నీకు ఇస్తాం!' అంటూ... తమ దేవతలను అందరినీ ముందుగా ప్రార్థించుకొని, వేటకు ఉపకరించే మంత్రమూలికలను తీసుకొని, శకునం మంచిగా కుదిరినపుడు మిక్కిలి సంతోషించి, ఎరుకులు

(యయాతి ప్రభువు కడకు) వచ్చి, వేటాడడానికి పూనుకొన్నారు" అని ఈ పద్యం యొక్క సంపూర్ణ భావం!

ఎరుకులు ఆటవికులు. వీరిని కిరాతులు, బోయలు అని కూడ వ్యవహరిస్తారు. వీరి ప్రధాన వృత్తి అడవులలో క్రూర జంతువుల వేట. ఆదికవి వాల్మీకి మహర్షి పూర్వాశ్రమంలో ఈ జాతికి చెందినవాడే అని ఐతిహ్యం!

ఈ ఎరుకల స్త్రీలనే దైవజ్ఞులుగా భావించే వారు. "ఎరుక" లేక "సోది" పేరిట భవిష్యద్దర్శనం చేయించే అట్లాంటి స్త్రీని "ఎరుకలసాని"గా పిలిచేవారు. మొన్నమొన్నటి వరకు ఈ జోస్యం చెప్పించుకొని గాఢంగా విశ్వసించినవారు ఎందరో ఉండేవారు.

కవి ఈ పద్యంలో – నరసింహస్వామిని; పరమశివుని; మల్లమ్మ, దుర్గమ్మ రూపాలలో పార్వతీదేవిని వన దేవతలుగా చిత్రించారు. ఆధునిక కాలంలో – ఇప్పుడు అందరూ ఆరాధిస్తున్నా, ప్రాచీన కాలంలో – మల్లమ్మ, దుర్గమ్మలే కాదు .. మైసమ్మ, డొక్కలమ్మ.. మొదలైన ఎన్నో రూపాలలో ఆదివాసులు అమ్మవారిని పూజించడం మనకు విదితమే! అట్లాగే, శంకరుని కూడ మల్లన్న, భీమన్న, భైరవన్న, రాజన్న .. ఇట్లా అనేక రూపాలలో వారు పూజించడం కూడ తెలిసిన విషయమే! మరి .. నరసింహ స్వామిని వనదేవతగా పేర్కొనడం ఏమిటి? ఇక్కడ – తెలగన కవి భావనా చమత్కృతి ఇమిడి ఉన్నది. నరసింహ స్వామి చెంచులక్ష్మిని చేపట్టాడు కదా! చెంచుల ఇంటి అల్లుడు మరి! అందుకే వారి ఇష్టదైవం అయ్యాడు! ఇక ఈ దైవాలకు ఎరుకులు సమర్పించిన మొక్కులు కూడ ఎంతో ఔచితీమంతంగా ఉన్నాయి. నరసింహావతారుడైన శ్రీమహావిష్ణువుకు వాహనం గరుడ పక్షి. పరమశివుడు అంగవస్త్రంగా జింక చర్మాన్ని చుట్టుకొంటాడు. ఇక .. పార్వతీదేవి సింహవాహిని. అంతే కాదు .. దుర్గామాతకు దున్నలను బలి ఇవ్వడం ఆనాటి సంప్రదాయం! ఇట్లా .. ఏ దైవానికి ఏదో రకంగా ప్రీతిపాత్రమైన జంతువేదో .. అదే జంతువును పట్టి తెచ్చి సమర్పించు కొంటామని వారు మ్రొక్కినట్లుగా – పొన్నికంటి కవి ఎంతో ఆలోచనాత్మకంగా వివరించడం ప్రశంసనీయం!

యతివివేచనము - 1

- చిటితోటి విజయకుమార్

కొత్తగా పద్యాలు రాసే కవులు యతి విషయంలో కొన్ని సందేహాలకు లోనవుతుంటారు. రకరకాల పేర్లతో ఎన్నో యతి భేదాలు ఉండటమే దీనికి ప్రధాన కారణం. అయితే కొంచెం తార్కికంగా పరిశీలిస్తే యతి నియమాలు అంత కష్టమేమీ కాదు. నేను ఈ వ్యాసంలో యతి విధానాన్ని సులభంగా గ్రహించే మార్గాలను వివరిస్తాను. ఈ వివరణకు చాలా ఛందోగ్రంథాలు, ఛందోవ్యాసాలు ఉపయుక్తమయ్యాయి. ముఖ్యంగా శ్రీ పేరి రవికుమార్ గారి "పద్యవిద్య" గ్రంథం ఎంతో ఉపకరించింది. వారికి నా కృతజ్ఞతలు.

యతి అంటే ఏమిటి? పద్యంలోని ఏ పాదంలోనైనా మొదటి అక్షరాన్ని 'వళి' (లేదా యతి) అంటారు. పద్య లక్షణాన్ని బట్టి పద్యపాదంలోని ఒక నిర్దిష్ట గణం యొక్క ప్రథమాక్షరమో, లేక ఒక నిర్దిష్ట అక్షరమో యతిస్థానం అవుతుంది. పద్యపాదంలోని మొదటి అక్షరానికి (వళికి), యతిస్థానంలో ఉన్న అక్షరంతో మైత్రి ఉండాలి. దీన్నే 'యతిమైత్రి' అంటారు.

కొన్ని ముఖ్యమైన నియమాలు:

1. దండక విలక్షణత: ఛందోబద్ధమైన రచనలలో యతి నియమం లేని పద్యం 'దండకం' ఒక్కటే.
2. అచ్చుల మైత్రి: అచ్చులకు అచ్చులతోనే యతి మైత్రి ఉంటుంది కానీ హల్లులతో ఉండదు.

- సంధి జరిగినప్పుడు యడాగమంతో కూడిన అచ్చుతో గానీ, నుగాగమంతో కూడిన అచ్చుతో గానీ, లేదా పరపదం యొక్క ప్రథమాక్షరంగా ఉన్న అచ్చుతో గానీ వళి స్థానంలోని అచ్చుకు యతిమైత్రి కూర్చాలి.
- సంధికార్యం జరిగినప్పుడు పూర్వపదం యొక్క చివరి హల్లు, పరపదం యొక్క అచ్చుతో కలిసిపోయి ఉంటే... ఆ హల్లుతో వళి స్థానంలో ఉన్న అచ్చుకు యతిమైత్రి చేయరాదు.
- ఉదాహరణకు: 'తళుకులీనెడు భాష మ-దాంధ్రభాష' అన్నప్పుడు, వళి అయిన 'త'కారానికి యతి స్థానంలో ఉన్న 'ద'కారంతో యతి కూర్చరాదు. 'మదాంధ్రభాష' అనేది 'మత్ + ఆంధ్రభాష' అని విడిపోతుంది కనుక, 'మత్' లోని పొల్లు తకారంతో కాక, 'ఆంధ్రభాష' లోని 'ఆ'కారంతోనే యతి చెల్లించాలి.
- అఖండయతి: కొందరు పై ఉదాహరణలో చూపినట్లు వళి అయిన 'త'కారానికి యతి స్థానంలోని 'ద'కారంతో యతి మైత్రి కలుపుతున్నారు. ఇటువంటి యతిని 'అఖండయతి' అంటారు. ఇది శాస్త్రరీత్యా సమర్థనీయం కాకపోయినా ప్రయోగాలలో విరళంగా కనిపిస్తుంది. అయితే, ఈ అఖండయతిని పరిహరించడం ఉత్తమం.

3. హల్లు-అచ్చుల సంయుక్త నియమం: హల్లు అచ్చుతో కూడి ఉన్నప్పుడు హల్లుకూ, అచ్చుకూ రెంటికీ కలిపి యతిమైత్రి చూడాలి. ఉదాహరణకు: 'కి' అనే అక్షరానికి 'కి, కీ, కృ, కౄ, కె, కే' అక్షరాలతోనే యతి చెల్లుతుంది కానీ 'కు, కూ, కొ, కో, కై, కౌ' లతో కాదు.
4. ప్రాసయతి విశేషాలు: పాదం మొదట్లోని రెండవ అక్షరానికి (ప్రాసకు), యతిస్థానం తరువాత వచ్చే అక్షరంతో యతి కూర్చడాన్ని 'ప్రాసయతి' అంటారు. ప్రాసయతిలో హల్-సామ్యం (హల్లుల పోలిక) ఉంటే చాలు, అచ్-సామ్యం (అచ్చుల పోలిక) అవసరం లేదు.

- ప్రాసయతి లేని పద్యములలో ఒక పాదమున స్వరయతి, ఒక పాదమున వ్యంజనయతి, మఱొక పాదమున ఉభయయతి... ఇలా విడివిడిగా ఉండవచ్చును.
- ప్రాసయతి నియమం ఉన్న పద్యములలో ఏ పాదంలోనైనా ప్రాసయతి లేదా స్వరయతి లేదా వ్యంజనయతి లేదా ఉభయయతి ఉండవచ్చును. ఈ భేదాల గురించి తర్వాత సవివరంగా చెప్పుకుందాం.

తెలుగు యతివిధానంలో కొన్ని స్వేచ్ఛలు:

- పదచ్ఛేద, పాదాంత నియమాలు లేకపోవుట: తెలుగులో యతిస్థానమున పదచ్ఛేద నియమం కానీ, పాదాంత నియమం కానీ లేదు. అంటే ఒక పదం ఒక పాదం చివర ప్రారంభమై, విరిగి తర్వాతి పాదంలోకి కొనసాగవచ్చు.
- ఉదాహరణ (శ్రీమదాంధ్ర భాగవతం నుండి):
  "కనియెన్ రుక్మిణి చంద్రమండలముఖుం, గంఠీరవేంద్రావలగ్ను, నవాంభోజదళాక్షుఁ, జారుతరవక్షున్, మేఘసంకాశదేహు, నగారాతి గజేంద్రహస్త నిభ బాహుం, జక్రిఁ, బీతాంబరున్.."
- **విశ్లేషణ:** పై పద్యంలో మొదటి పాదం చివర నుంచి రెండో

పాదం మొదట్లోకి 'వలగ్ను' అనే పదం, రెండో పాదం చివర నుంచి మూడో పాదం మొదట్లోకి 'దేహు' అనే పదం విరిగి వచ్చాయి. అట్లే ఈ మత్తేభ పద్యంలో రెండో పాదంలో 14వ అక్షరం యతిస్థానం కాబట్టి, సాధారణంగా 13వ అక్షరం తర్వాత విరామం (విశ్రాంతి) ఉండాలి. కానీ ఇక్కడ 13వ అక్షరమైన 'వ' తర్వాత పదచ్ఛేదం (విరామం) లేదు. 14వ అక్షరమైన 'గ్ను'తో పాదంలోని ప్రథమాక్షరమైన 'గ' (గంభీరవేంద్ర...) జకార-గకారమైత్రితో యతి చెల్లింది.

- పదంలో యతి స్థానం: తెలుగులో యతిస్థానం అనేది పదానికి మొదట్లో కావచ్చు, మధ్యలో కావచ్చు లేదా చివరైనా కావచ్చు. ఉదాహరణకు "రామ" లోని "రా" అనే అక్షరానికి:
  1. "రాజ" లోని పదాది "రా" తో గానీ,
  2. "విరామ" లోని పదమధ్య "రా" తో గానీ,
  3. "భళిరా" లోని పదాంత "రా" తో గానీ యతి చెల్లుతుంది.
- అనుస్వార, విసర్గల నియమం: యతి కూర్చేటప్పుడు పూర్ణబిందువును (సున్న), విసర్గను, అర్ధానుస్వారాన్ని (అరసున్న) వదిలి (కేవలం హల్లును/అచ్చును మాత్రమే పరిగణనలోకి తీసుకుని) యతి చెప్పవలెను.
- ఉదాహరణకు:
  1. 'దు' కు 'బంధుర' లోని బిందుపూర్వక "ంధు" తో యతి చెల్లుతుంది.
  2. 'క' కు 'దుఃఖము' లోని విసర్గపూర్వక "ఃఖ" తో యతి చెల్లుతుంది.
  3. 'దు' కు 'వీఁడు' లోని అర్ధానుస్వారపూర్వక "ఁడు" తో యతి చెల్లుతుంది.
- ఇట్లే కకారానికి "కం", "కః", "కఁ" లతో యతి మైత్రి కుదురుతుంది.

ఇక యతి భేదాల వివేచనను ప్రారంభిద్దాము. **(సశేషం)**

పద్యపరిమళం

ప్రౌఢ ప్రయోగాలకు నిలయం - చంద్రికాపరిణయము

రమణీయ తర పదార్థ ప్రకాశ నిదాన
భాస్వ త్ప్రసాద సంపద వహించి,
పటుసార సానంద ఘట కైక చాతుర్య
ఘన కృతాలంకార కలన మెఱసి,
అనుకూలకాలకంఠాకుంఠ కలనాద
వలమాన మంజుల ధ్వనుల నలరి,
అతివేల కవిజాల కామోద నాపాద
కారణ రసభావ గరిమ నెనసి,
పరమ యతి యోగ సంస్థాన పద మనోజ్ఞ,
వైభవోన్నతి దగు సరస్వతి మదీయ
మాన సాస్థాన మందిర మధ్య వీధి
నిండు కొలువుండు గాత నిష్టంద లీల

ఈ పద్యం జటప్రోలు సంస్థానాధీశుడు, రాజకవి అయిన శ్రీ సురభి మాధవరాయలు తన ప్రౌఢ ప్రబంధమైన "చంద్రికాపరిణయము" కావ్య ప్రారంభంలో (అవతారికలో) చేసిన సరస్వతీ స్తుతి (పద్య సంఖ్య 1-4). ఇది తెలుగు సాహిత్యంలో అఖండ పాండిత్యంతో కూడిన సీస పద్యం.

భావము: మిక్కిలి సుందరమైన శబ్దార్థాల (పదార్థముల) ప్రకాశానికి మూలమైనట్టిది, దేదీప్యమానమైన అనుగ్రహ సంపదను కలిగినట్టిది; మిక్కుటమైన సారాంశంతో, ఆనందాన్ని చేకూర్చే ఘటనా సామర్థ్యంతో, గొప్పవైన అలంకారాల కూర్పుతో ప్రకాశించునట్టిది; అనుకూలమైన కోకిలల వంటి కుంఠితము కాని మధుర ధ్వనులతో (కలనాదములతో) ఒప్పారునట్టిది; అమితమైన కవిసమూహానికి అత్యంత ఆనందాన్ని, రసభావ మహత్వాన్ని ప్రసాదించునట్టిది; పరమయోగుల యొక్క హృదయ స్థానాలలో మనోజ్ఞమైన వైభవంతో విరాజిల్లునట్టిది అయిన "సరస్వతీ దేవి" నా యొక్క మనస్సు అనే సభా మందిరము (ఆస్థాన మందిరము) మధ్య భాగంలో ఎల్లప్పుడూ నిశ్చలముగా, నిండు కొలువై ఉండుగాక!!!

విశేషాంశాలు (శ్లేష చమత్కారం):

సురభి మాధవరాయల కవిత్వం రామరాజభూషణుని 'వసుచరిత్ర' వలె శ్లేషలకు, ప్రౌఢ ప్రయోగాలకు నిలయం. ఈ పద్యంలో కవి సరస్వతీ దేవిని స్తుతిస్తూనే,

"తన కావ్య సరస్వతి (చంద్రికాపరిణయము)" రెండింటికీ వర్తించేలా అద్భుతమైన ద్వ్యర్థి (శ్లేష) చమత్కారాన్ని ప్రదర్శించారు:

*రమణీయమైన శబ్దార్థాలకు కారణం ప్రసాదమనే కావ్యగుణం అది ఉండాలి!

(మిగతా 7వ పేజీలో)

విశిష్ట తెలుగు భాషా వైభవం
11 ఛందః ప్రాముఖ్యం

- డా. సంగనభట్ల నరసయ్య

సంపద్విరామ పాదాశ్చ, దేవతాస్థాన మక్షరం
వర్ణః స్వరాః విధిర్వృత్తం

ఇతి ఛ్చందోగతో విధిః అని విధిని పేర్కొని, గణముల ఊసెత్తలేదు. అయితే విధి గణకృత విధి, అర్థకృత విధి అని రెండు రకాలు. 'వధిర్గణ కృతశ్చైవ, తథార్థకృతో–పివా' అని నాట్యశాస్త్రమున వివరించినాడు. పాదనిర్మాణ విధి (విధానము) గణకృతవిధి అర్థకృత విధి అన్నాడు.

మార్గిఛందాలలో పదాలపేర్పు అత్యధికంగా అర్థకృతంగానే ఉంటుంది. ఉదాహరణకు తిక్కన రాసిన శార్దూల విక్రీడితములో పరిశీలిద్దాం.

శా. దుర్వారోద్యమ, బాహువిక్రమ, రసస్తోక, ప్రతాపస్ఫురత్ అనే చోట పదాల లేదా పదబంధాల (సమాసాల) విరుపు గణవశాత్తు కాక అర్థవశాత్తుగా నడిచింది. గణాల్లో మాట్లాడుకుంటే మలల, రలల, యగ, యలగ ఇలా విరిగింది. ఇది అర్థకృతవిధి. వక్త (ద్రౌపది పాత్ర) ఎలా మాట్లాడుతుందో అదే అర్థవశాత్తు విరుపు. ఇది అర్థకృతవిధి. దీన్ని "భావగణా"లందాం. తరువాతి పాదంలో ఈ విరుపు లుండాలని నియమం లేదు. ఉండకపోవచ్చు. ఇది అర్థకృతవిధి. ఈ విధానం వల్ల తెలుగు పద్యాల "పొసగ ముత్తెపుసరుల్ పోహళించిన లీల'' ముత్యాల సరాలు లాగ బహువిధనర్తనములు, వర్తనములైనాయి. ఒకేఛంద, ఒకే కావ్యంది ఒకే ఘట్టంలో సహస్రవిధాలుగా విరిగింది. మరో శార్దూలంలో తిక్కన మరో విధంగా రాశాడు.

శా. ఆరూపం, బవికార, మా భుజబలం, బత్యంత, నిర్గర్వమా అని మ, సల, భలగ, త, తగ ఇలా విరిగింది. గణవశాత్తు కాక అర్థం చూసుకొని విరుస్తున్నాం. వీటిని అర్థకృతవిధి అని అనాలి.

మరి గణకృత విధానమంటే గణాలవారీగా పదాల పోహళింపు. గణాలవారీగా పద్యపాదం విరగడం. ఈ విధానం శార్దూలాదుల్లో కాక తెలుగు కవులు మాత్రాసమత గల గణాల్లో క్వాచిత్కంగా చూపినారు. ఇదే తిక్కన వాడిన మానిని పద్యం చూస్తే అర్థం అవుతుంది.

మానిని: తమ్ములు, దానును, ధర్మత నూజుడు, దక్షిణ, సంభృత సంభ్రముడై ఇక్కడ గణమున కొకసారి విరిగినది. తిక్కన గణమున కొక పదముగా రాసినాడు. మానిని గేయఛందం. అక్షరఛందంగా ఇది పేర్కొనబడినా, 7 భగణాలు ఆపై గురువు. భగణంలో నాలుగు మాత్రలు కనుక గణంకొక్క పదంగా విరిగితే చతురస్రగతిలో నడుస్తుంది. 3వ, 4వ గణం (2 భగణాలు) ఒకే సమాసంగా ఉన్నా (ధర్మత–నూజుడు) నడక చెడదు. 4 మాత్రల భగణం విడిపోతూ శ్రోతను ఆ లయలోకి తీసుకొని పోవడం వల్ల నాల్గవగణం ముందు కూడా చతురస్రగతిలో శ్రోత విరిచి పలుకుతాడు. అయితే ఇలా నడకలను (మాత్రాసమతను) అక్షరఛందాల్లో తెలుగు కవులు వాడారని అనలేం. ఉదాహరణకు గణంకొక్క పదం విరిగితే పదాల ఎంపికలో కవికి స్వేచ్ఛ ఉండదు. భగణపదాలే వాడాలన్ననియమం ఏర్పడుతుంది. ఐతే ఉదాహరణకు

మానిని అమ్మని/నాథవ/రేణ్యున/కున్విన/యమ్మున/మ్రొక్కిస/మున్నత/పీఠి అవే గణాలు. అదే ఛందం. నన్నయ ఇక్కడ పైన గీట్లు గీసినట్లు చదివేలా పదప్రయోగం చేయక అమ్మని నాథ వరేణ్యునకున్ వినయమ్మున మ్రొక్కి సమున్నతపీఠి... ఇలా అర్థకృతవిధిని వాడినాడు. "యత్రార్థేన గణవ్యవస్థా" అన్నట్టున్నది. ("యత్రార్థేన పాదవ్యవస్థా" అన్న ప్రసిద్ధ జైమినీయ మీమాంస సూత్రాన్ని నేను మార్చి రాసాను)

మానిని: 'జూదము నపుడు' 'సర్వజనంబులు' 'చూచిభయంపడి' ...ఇలా నన్నయ జంటలుగా విరిచినా లయావిష్కరణం పొంది వేల పద్యాల కథలు (భారత, భాగవతాదులు) ఏ కవి తన జీవితకాలంలో రాయలేదు. యతిప్రాసలు పదాల ఎంపికకు మరింత బంధాలౌతాయి. గణకృతవిధిని ప్రస్ఫుటించే దేశిచ్ఛందాల్లో సైతం ఈ నియమం ఉల్లంఘించారు.

దేశిచ్ఛందాల్లో గణకృతవిధి బాగా కనపడుతుంది. పాదంలో సూర్యేంద్రచంద్ర గణాలుగా పదాలు విడిపోవడం సహజం. కారణం మాత్రాబద్ధకాల ఖండాలనుండి దేశిగణాలు పుట్టడం వల్ల, గణంకోపదం రాయడం, పదాది అక్షరాలు యతిగా నిలవడం (గణాద్యక్షరయతి) కనిపిస్తుంది. అందుకే దేశిపద్యాల నడకలు పద్యం చదువుతుంటే చటుక్కున తెలిసిపోతాయి.

చిన్న చిన్న రాళ్ళు చిల్లర దేవుళ్ళు
నాగు లేటి నీళ్ళు నాప రాళ్ళు

సజ్జ జొన్న కూళ్లు సర్పంబులును తేళ్లు
పల్లె నాటి సీమ పల్లె టూళ్లు

శ్రీనాథుని ఈ చాటువుగణకృత్విధికి అద్భుత ఉదాహరణ. 3సూ., 2ఇం. తొలిపాదం, 5సూ.గ. మలిపాదంలో ఉండే ఆటవెలది పద్యంలో గణం కొక్క పదం పేర్చి పద్యం ఆశువుగా చెప్పినాడు. వేమన్న ఆటవెలదికి, శ్రీనాథుడు సీసానికి ఎందుకు ప్రసిద్ధులంటే ఈ గణకృతవిధిలో బహుసంఖ్యలో పద్యాలు రాసినారు.

ఉప్పు కప్పురంబు ఒక్కపోలిక నుండు
చూడ చూడ రుచుల జాడ వేరు

కప్పురంబు వంటిచోట్ల (రెండు గణాలు ఒకపదంగా) అరుదుగా విరిగినా, నడక మనసులో అప్పటికే స్థిరమై ఉంటుంది కనుక లయ జారదు. పదం పలికి విశ్రాంతి ఇస్తాం. మాటలో, రాతలో అలాగే విశ్రాంతి ఉంటుంది. అదే ఇక్కడ గణంగణంకు విశ్రాంతి. పాదే పాదే ప్రతిగణమపి యతి నిర్లక్ష్యతే అన్నట్టు కప్పు పలికి విశ్రాంతిచ్చి రంబు అని వికృతంగా విరిచి చదవం. 'యత్రార్థవశేన' పదచ్ఛేదం ఉంటుంది. పై ఉదాహరణలో ఆ బాధ లేదు.

సీ. మందార మకరంద మాధుర్య మునదేలు
మధుపంబు వోవునే మదన ములకు అని సీసం గణకృతవిధిగా నడిపిన పోతన తరువాతి పాదాల్లో ఆచరించలేదు. ఆ నియమం కవిని పద్యాలు అల్లకుండా బాధిస్తుంది. శ్రీనాథుడు ఈ నియమం పాటించి సీసాధినాథుడైనాడు. ఈ నడకలను రామరాజ భూషణుడు అంత్యప్రాసగా ఒక అక్షరం నియమంగా ఉంచి అర్థవశాత్తు విరగకున్నా అనుప్రాసవశాత్తు విరిగేలా చూపి సీసం నడక సాధించాడు.

ఒకచాయ ననపాయ పికగేయ సముదాయ

ఒకసీమ నానామ యూర నినద వంటివి సర్వపాద నిర్దేశిత నియమాలు.

కం. అడిగిన జీతం బియ్యని... వంటి కందపు నడకలు ఇలాగే గణకృతవిధిలోనే (కందమని) తెలిసిపోతాయి.

"నానన నానా నానన

నానానన నాననాన నానా నానా" అనే పద్ధతిలో మనసులో నడకలు ఊహించి పామరులు సైతం పద్యాలు అల్లగలరు. పాటల అల్లిక పామరులు అలాగే చేస్తారు. లయకు మనసే కొలత వారికి.

ఉడికీ ఉడకని మెతుకులు
కాటువొయినా కందిపప్పు కాగని చారూ
గొడ్డళ్లకు తెగని బూరెలు
సిద్దెలతో మురికి నెయ్యి సీతారామా "అని రుచిగా భోజనం లేదన్న సంగతి ఓ గడుసరి కందంలా" పాడినాడు. ఇక్కడ ప్రాస కుదరలేదు. వానికి అక్కర్లేదు. వీడు అపండితుడైనా కందం నడకను కాపాడినాడు.

నన్నయ గణకృతవిధి పాటింపక రాసిన పద్యం

కం. శరమో - క్షణవే - గనిరం
తరమం - దలితో - రుచాప - దండుక - కాండో
ద్ధురదం - దధరుడ - పోలెన్
హరినం - దనుదా - కె్రుపదు - దయ్యు - ద్ధతుడై

అన్న పద్యంలో అర్థకృతవిధిగా శరమోక్షణవేగ, నిరంతర మండలిత, ఉరుచాప ఇలా చదవాలి. ఇది అర్థవశాత్తు చదివితే చదవగానే కందంలా స్ఫురించదు. అర్థకృతవిధి వలన లయ లుప్తమయింది. దేశిచ్ఛందాలు గణకృత విధానంలో ఉంటేనే నడకలు తెలుస్తాయి. నన్నయాదులకు తెలియకనా? కాదు. వాళ్లముందు సుదీర్ఘకథ, వందల వేల పద్యాల రచనాభారం ఉంది. ఈ విధానం ఆలస్యహేతువు.

పద్యాలు అంటే గణాలు దొర్లించి (పేర్చి పారేసి) రాయడం కాదు. ఇంత శిల్పచాతుర్యం, శాస్త్ర రహస్య వివేకం ఉంటుంది. అవధానకవుల ఆపద్ధర్మ, వేగోక్తి రచనల్లో అటు సమర్థుల చేతిలో సౌందర్యం, ఇటు కలాతీతమై పేలవత్వం రావడం వెనుక ఇదిగో ఇదే రహస్యం సుమా!

(5వ పేజీ తరువాయి)

ప్రౌఢ ప్రయోగాలకు నిలయం - చంద్రికాపరిణయము

*అలంకారాలు ఉండాలి అవి ముఖ్యంగా సరస్సులకు ఆనందం కలిగించాలి

*అవ్యక్త మధురమైన శబ్దములతో మంజుల ధ్వనుల (వ్యంగ్యార్థాలతో) అలరారాలి!!

*పండితమండలిని ఆనందింపజేసే విధంగా నవరసాత్మకమై శోభించాలి!!

*చక్కని యతులకు ఆటపట్టైన పద్యపాదాలతో అందగించాలి!!

ఇటువంటి వాగ్ వైభవానికి అధిదేవత అయిన సరస్వతి నా హృదయంలో నిండుకొలువు ఉండాలని సురభి మాధవ రాయల ఆకాంక్ష ఈ రీతిగా సరస్వతీ స్తుతి వ్యాధితో కవి ఇందులో సు కవితా ప్రసక్తి చొప్పించడం విశేషం!!

అష్టావధాని డాక్టర్ బోచ్కర్ ఓమ్ప్రకాశ్

పద్యపరిమళం

- అన్నమరాజు ప్రభాకరరావు

సంస్కృత ప్రియంభావుకత్వము

ఉ. రాజకులైకభూషణుడు, రాజమనోహరు డన్యరాజ తే
జోజయశాలి, శౌర్యుడు, విశుద్ధ యశశ్శరదిందు చంద్రికా
రాజిత సర్వలోకు, డపరాజిత భూరి భుజాకృపాణ ధా
రాజల శాంత శాత్రవ పరాగుడు, రాజమహేంద్రు దున్నతిన్

(ఆది. 1 – 3)

ఈ పద్యము ఆంధ్ర మహాభారతము ఆదిపర్వము నందలి ప్రథమాశ్వాసము లోని మూడవ సంఖ్య గలది. కానీ నిజానికిదే మొట్ట మొదటి పద్యము. ఒకటవ సంఖ్య గలది **"శ్రీవాణీ గిరిజా శ్చిరాయ దధతో..."** అనే మంగళాశాసనము, తరువాత అవతారిక ... అందులో మొదటిది వచనము. ఆ తరువాతి పద్యమిదే.

అర్థము సుగమమే కనుక విశేషాలను పరిశీలించినట్లయితే – ఈ పద్యము చంద్రవిద్యోపాసకుడు, చంద్రవిద్యా ప్రవర్తకుడు అయిన రాజరాజ నరేంద్రునకు, ఉపాస్య దేవత, అయిన చంద్రునకు కూడా (విశుద్ధ యశశ్శరదిందు చంద్రికా రాజిత సర్వలోకుడు) అభేదము పరికల్పించిన యుక్తి యుక్తమైన రూపకోత్పలము. ఈ ఉత్పలము నందలి ప్రతి రూపక దళము "రాజ" శబ్దముతో విరాజిల్లుచు అడుగడునకు చంద్రుని స్ఫురింపజేయుచున్నది. పురాణ జగత్ప్రసిద్ధులయిన ద్వాదశ శ్రీవిద్యోపాసకులలో చంద్రుడు కూడా ఒకడు. రాజరాజు చంద్రవంశానికి చెందినవాడు. కనుక ఈ అభేద రూపకల్పన.

రెండవది. మొదట మంగళశాసనముగా వ్రాసినది సంస్కృతములో విరివిగా ఉపయోగములోనున్న శార్దూల వృత్తములోనే అయినా, ఇక్కడ మాత్రము సంస్కృత సాహిత్యములో అప్రసిద్ధమైన ఉత్పలమాల.

మూడవది. ఈ పద్యములో క్రియా పదము లేదు. రెండు పద్యముల తరువాత **"ఘన దురితానుబంధ కలికాలజ దోష తుషార సంహతిన్...."** (ఆది. 1– 5) అనే పద్యములో ..... చివరి పాదములో.....నెంతయు / దనరు అనేచోట ఉన్నది.

నాల్గవది. ఈ పద్యములోని విశేషణాలన్నీ కూడా ప్రథమా విభక్త్యంతముగా ఉన్నాయి. పద్యము అలతి అలతి పదాలతో ప్రారంభమై క్రమేణా దైర్ఘ్యాన్ని సంతరించుకొని సరళ మనోహరంగా సాగి కడకు అలతి పదాలతోనే పరిసమాప్తమైనది.

అయిదవది. సాధారణంగా ఒకే విషయాన్ని (ఒక పద్యము చాలని, సీసపద్యము అవసరము లేని సందర్భాలలో) రెండు పద్యాలలో చెప్పిన సంఘటనలు పురాణ కావ్య ప్రబంధాల్లో కోకొల్లలు. ఆ రెండు పద్యాలను కలిపి **"కులకము"** అంటారు. కానీ ప్రస్తుతము రాజరాజు వర్ణనకు మూడు పద్యాలు ప్రయుక్తమయినాయి.

అట్లుండగా, తెనుగున వ్రాయుచున్న కావ్యములో నింతటి సంస్కృత సమాసభూయిష్ఠమైన పద్యరచన అవసరమా అనునది ప్రశ్న. నన్నయ మహాభారతానుసృజనకు పూనుకొనగానే అప్పటికి తెలుగులో నున్న పదసంపద అతి స్వల్పమనియు, ఒక బృహత్కావ్య రచనకది చాలదనే విషయాన్ని గ్రహించినాడు. కారణములు రెండు. ఒకటి వ్యాసులవారే **"యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి నతత్ క్వచిత్"** అని తీర్మానము చేసియున్నారు. రెండవది రాజరాజ నరేంద్రుడు నన్నయను

కం. జననుత! కృష్ణద్వైపా
యనమునివృష భాభిహిత మహాభారతబ
ద్ధనిరూపితార్థ మేర్పడ
దెనుఁగున రచియింపు మధిక ధీయుక్తి మెయిన్

(ఆది. 1 – 16)

అని చెప్పినాడు. ఈ రాజరాజు పలికిన పద్యమును నిశితంగా గమనించినట్లయితే – ఒకటి – మూల కర్త అయిన కృష్ణ ద్వైపాయనుడు ముని వృషభుడు కనుక ఆంధ్రభారతము యొక్క స్థాయి మూలము యొక్క స్థాయికి తగ్గకుండా ఉండాలి. రెండవది – మహాభారత బద్ధ నిరుపితార్థ మేర్పడేట్లు చెప్పాలి.

ఇన్ని నిబంధనల నడుమ ఆంధ్ర మహాభారత రచన జరుగవలె. అప్పటికి ఆంధ్రభాషలో నున్న పదసంపద అతి స్వల్పమును, అల్ప శక్తిమంతము నయిన శబ్దజాలము. ఆనాటికి ఉదాహరణ ప్రాయము లనదగిన కావ్యాలు తెలుగులో లేవు. కనుక, నన్నయ ప్రధానముగా సంస్కృతమును తీసికొనినాడు. తనకంటెను ముందు నుంచి ఉన్న తెనుగు భాషను కూడా స్వీకరించినాడు. కేవల సంస్కృత మిశ్రిత భాషగా కాక సంస్కృత "శబ్ద"మిశ్రిత భాషగా తీసికొనినాడు.

ఈ విధముగా అవసరార్థము నన్నయ్య "సంస్కృతమును తెలుగులో కూడా" ప్రేమించవలసి వచ్చినది. కనుక, అనేక సందర్భాలలో తన సంస్కృత ప్రియం భావుకత్వాన్ని ప్రదర్శించ వలసి వచ్చింది. కొన్ని ఉదాహరణములు :

ప్రార్థనల యందు. ఉదంకుడు పాతాళలోకమున కేగి చేసిన నాగరాజ స్తుతులు

చం. బహువన పాదపాబ్ధి కులపర్వత పూర్ణ సరస్సరస్వతీ
సహిత మహామహీభర మజస్ర సహస్ర ఫణాళి దాల్చి దు
స్సహతర మూర్తికిన్ జలధిశాయికి పాయక శయ్యయైనయ
య్యహిపతి దుష్కృతాంతకు డనంతుఁడు మాకు ప్రసన్నుడయ్యెడున్
(ఆది. 1 - 104),

అదే విధంగా ఆ తరువాతి మూడు పద్యాలు - **అరిది తపోవిభూతి ...**(ఆది. 1 - 105), **దేవమనుష్య లోకముల ద్రిమ్మరుచున్...** (ఆది. 1 - 106), **గోత్రమహామహీధర నికుంజములన్...** (ఆది. 1 - 107) - కూడా దీర్ఘ సంస్కృత సమాస భూయిష్ఠాలై, ఉదంకుని మనోభావ గాఢతకు, ప్రార్థిత నాగరాజుల స్థాయికి, కాగల కార్యప్రాముఖ్యానికి తగిన విధంగా ఉన్నాయి. ఈ నాలుగు పద్యాలు కూడా తెలుగు సాహిత్యంలో అత్యంత ప్రసిద్ధి చెందినవాటిలో ఉన్నాయి.

మహాఘట్టము. కద్రూ వినతలు వినోదార్థము విహరించుచు చూచిన సముద్రమును **"కరిమకరనికరాఘాత జాత వాతోద్ధూత తుంగ తరంగాగ్ర సముచ్ఛలజ్జల కణాసారచ్ఛటాచ్ఛాదిత గగనతలంబైన దాని, సుద్యానవనంబునుం బోలె బహువిద్రుమ లతాలంకృతంబైన దాని, నాటక ప్రయోగంబునుం బోలె ఘనరసపాత్ర శోభితరంగ రమ్యంబైన దాని, దివంబునుం బోలె మహిమకరభరితంబైన దాని..."** , అని వర్ణించిన వచనము (ఆది. 2 - 28)లో కేవలం "అయినదాని", "పోలె", అను పదాలు తప్ప తక్కినదంతా సంస్కృతమే. వెంటనే చెప్పిన తరువాతి పద్యము **"అలఘు ఫణీంద్ర లోక కుహరాంతర దీప్త మణి స్ఫురత్ప్రభా / వళి గలదాని ....."** (ఆది. 2 - 28) మరింత ప్రౌఢ సంస్కృత సమాస భూయిష్ఠమై యున్నది.

అదే విధంగా

మ. వివిధోత్తుంగ తరంగ ఘట్టిత చలద్వేలావనైలావలీ
లవలీలుంగలవంగ సంగత లతాలాస్యంబు లీక్షించుచున్
ధవళాక్షుల్ సని కాంచి రంత నెదురం దత్తీర దేశంబునం
దవతాంబుజ ఫేనపుంజనిభు నయ్యశ్వోత్తమున్ దవ్వులన్
(ఆది. 2 - 29)

అదే సందర్భములో చెప్పిన గొప్ప పద్యము. ఈ అశ్వ దర్శనమే అనంతర కాలంలో సర్పయాగానికి, ఆ సందర్భములోనే జనమేజయునికి వైశంపాయనుని ద్వారా, తద్వారా లోకానికి మహాభారత ప్రవచనం జరుగటానికి కారణమైంది. అందు వలననే నన్నయగారు ఈ సందర్భాన్ని విశిష్టంగా నిలబెట్టినారు.

పరాక్రమ ఘట్టము. అర్జునుడు ఇంద్రుని పనుపున దేవతల కజేయులయిన నివాతకవచులను భయంకరమైన యుద్ధంలో సంహరించిన విషయము తన సోదరులకు వివరిస్తూ

చం. అతుల రణాంతరంబున నిరంతర మత్పటు బాణ పాతితో
ద్ధ్రిత దనుజాంగనిర్గళదసృగ్గల ధారలు సూడ నొప్పె, నా
తత గిరిశృంగసంగదళిత ప్రచలజ్జలవాహజాలసం
తత గళదంబుధారల విధంబున నంబర మెల్ల గప్పుచున్
(ఆర. 4 - 65)

అమరుల కోటువడని మూడుకోట్ల అసుర సంహారము కనుక యింతటి శబ్దశక్తి గల సంస్కృత పదప్రయోగము, మూడుకోట్ల మంది రాక్షసులు కుప్పతెప్పలుగా నెలకొరిగే విధంగా "నిరంతర పటు బాణ" ప్రయోగం చేస్తున్నాడు కనుక దీర్ఘసమాస ప్రయోగము ఔచిత్యాన్ని సంతరించుకొన్నాయి.

ప్రారంభంలోనే జనమేజయుడిని వర్ణిస్తూ

చం. ప్రతిహతశత్రువిక్రముడు, పాండవవంశవివర్ధనుండు, సు
వ్రతుడు, పరీక్షిదాత్మజు, దవద్యవిదూరు, దుదారకీర్తి, ని
ర్జితవివిధధ్వరుండు, జనమేజయు డన్ జనపాలు డుత్తమ
స్తుతమతి దీర్ఘసత్ర మజితుం డొనరించె శుభాభికాంక్షియై
(ఆది. 1 - 82)

ఈ పద్యములో జనమేజయుని గుణాలు వర్ణించి ఆయన వ్యక్తిని నిలబెట్టినాడు నన్నయ. ఇందువలన, మీద మీద ఉదంకుడు, మంత్రి పురోహితులు, ఆస్తీకుడు మొదలైనవారితో భాషించుచున్నప్పుడు జనమేజయుని మనః స్థితి మనకు గోచరమవుతుంది.

ఈ పద్యములో కూడా - మొదటి పద్యములో వలెనె ఒకటి రెండు పదాలు తప్ప, తక్కినవన్నీ సంస్కృత పదాలతో, ప్రథమా విభక్త్యంతము గానే సాగినాయి.

కానీ, ఈ పద్యములో - నిశితంగా పరిశీలించినట్లయితే - కేవలం సంస్కృత పదాలే కాకుండా సంస్కృత రచనాశైలి కూడా గోచరిస్తుంది. సాధారణంగా పద్యరచన చేసే వారు - ఈ పద్యంలోని నాల్గవ పాదాన్ని "స్తుతమతి జేసె ధారుణి నతుల్యశు భంకర సత్రయాగమున్" అని ముగిస్తారు. కానీ, నన్నయ మూడవ పాదము లోని **"జనమేజయుడన్ జనపాలుడు"** అనే పదబంధంతో పద్యం ముగిసినట్లనిపించినా, మళ్ళీ నాల్గవ పాదంలో **"అజితుండు"** అనే విశేషణాన్ని వాడినాడు. ఇది ఒక విధంగా సంస్కృత నిర్మాణ శైలి. మరొక ఉదాహరణము:

కం. దమయంతి మనోభవనిభు,
నమరేంద్రప్రతిము, దినకరాభు, సుధారుక్
సము, వరుణ సదృశు, ధనదో
పము, నశ్వి సమాను, నిషధపతి జూచి నలున్
(ఆర. 2 - 41)

(మిగతా 19వ పేజీలో)

వ్యాకరణ వరివస్య 11

ఎన్.సిహెచ్. చక్రవర్తి

కిందటి తడవ మనం ఉత్తునకు అచ్చు పరమైతే జరిగే సంధి మార్పులు కొన్ని చెప్పు కున్నాం. ఉత్తునకు అచ్చు పరమైతే వివిధంగా జరిగే సంధిరూపాలూ మార్పులూ ఇంకా కొన్ని ఉన్నాయి. ఆయా సూత్రాలక్రమంలో అవి ముందుముందు చెప్పుకుంటాం.

సంధిపరిచ్ఛేదంలో మూడవ సూత్రం **సంధి లేనిచోట స్వరంబుకంటెం బరంబయిన స్వరంబునకు యడాగమంబగు**

తెలుగులో రెండుఅచ్చులు కలిసినప్పుడు సంధి జరగడం అంటే ఏమిటో ఇంతకుముందు మనం చెప్పుకున్నాం. రెండుఅచ్చులు కలిసినప్పుడు సంధి రాకపోతే ఏమి జరుగుతుంది? అంటే...ఆ పదాల నడుమ యట్ అనే ఆగమం వచ్చి చేరుతుంది. అంటే యడాగమం జరుగుతుంది.

ఆగమం అంటే వర్ణాధిక్యము. అనగా ఒక అక్షరం అదనంగా వచ్చి చేరుతుంది.

పూర్వ పదం ద్రుతాంత పదం అయితే న కారంతో సంధి అవుతుంది.. పూర్వపదం ద్రుతాంత పదం కానప్పుడు ఇప్పుడు మనం చెప్పుకునే యడాగమం వస్తుంది.

ఉదాహరణలు పరిశీలిద్దాం:

మా +అమ్మ = మాయమ్మ .

రెండుపదాలనడుమ **యడాగమం** గమనించవచ్చు.

ఇలాటిచోట్ల సంధి జరిగితే **మమ్మ** వంటి అసాధురూపాలు ఏర్పడతాయి.

అలాగే **మీ+ ఇల్లు =మీ యిల్లు** అని యడాగమం వస్తుంది.

ఇలాగే ముందుముందు గ్రహించాలి.

యట్ అనే ప్రత్యయంలో ట్ అనేది ఇత్సంజ్ఞ. ఇత్సంజ్ఞ అంటే ప్రత్యయాలకు చివర ఉండి, వ్యాకరణ కార్యాలు జరిగే టప్పుడు లోపించే వాటిని ఇత్సంజ్ఞలు అంటారు. యట్ అనే ప్రత్యయంలో ట్ అనేది ఇత్సంజ్ఞ కనుక దీనిని టిత్తు(టకారం ఇత్తుగా కలది) అంటారు.

టకారం ఇత్తుగా కలిగిన ప్రత్యయాలు(టిత్తులు) సంధి కార్యం దేనికి విధించబడిందో దానికి ముందు వచ్చి చేరుతుంది.

సూత్రంలో స్వరానికి పరమైన స్వరానికి అని చెప్పారు కనుక రెండో పదం మొదట ఉన్న అచ్చుకు ముందే ఈ యట్ వచ్చి చేరుతుంది. అంటే అమ్మ లో అ కు ముందు వచ్చి చేరుతుంది.

అనగా **మా+ య(ట్)+ అమ్మ = మా యమ్మ** అనే రూపం సిద్ధిస్తుంది.

మరో విషయం... తెలుగులో దీర్ఘాచ్చులకు అచ్చుపరమైతే ఎక్కడా సంధి రాదు. ఇది సాధారణ నియమం. ఆమ్రేడితం పరమైనప్పుడు మాత్రం సంధి జరుగుతుంది.

(సశేషం)

ప్రహేళికా

మనసును రంజింపజేసి ఆహ్లాదపరిచేది కథలలో సాహిత్యం. మన కవులు రామాయణ మహాభారత కథలలోని అంశాలను ఆధారంగా తీసుకొని చమత్కారంగా సందర్భాన్ని బట్టి శ్లోకాలను అందించారు. అలాంటిదే ఈ శ్లోకం.

శ్లో॥ చిత్రం దేవి! విదేహరాజనగరే ధాత్రీ తలాత్ కన్యకాః
జాయంతే కిల! నాథ సంప్రతిమయా చిత్రాతిచిత్రం శ్రుతం।
సాకేతే ఖలు! పాయసాన్న కబళాత్ ప్రాదుర్భవంత్యర్భకాః
సీతారామ వినోదభాషణమిదం పాయాదపాయాత్ జగత్ ॥

సీతారామచంద్రస్వామి వారల సరస సంభాషణ ఇది. శ్రీరాముడు అన్నాడు “ఓ సీతా! విదేహరాజనగరంలో భూమి నుండి పిల్లలు పుడుతున్నారట కదా!” అని. సీతా అమ్మవారు భూమిలో దొరికింది కదా! ఓహో ‘నన్నే అంటున్నా’డని అనుకొని సీతమ్మ. “ఓ స్వామీ నేను కూడా విచిత్రమైన వార్త విన్నాను. అదేమిటంటే అయోధ్యా పట్టణంలో యజ్ఞం చేస్తున్నారట. దానినుండి పాయసం వస్తుందట. ఆ పాయసం తింటే పిల్లలు పుడుతున్నారట” అని అన్నది దశరథుడు పుత్రకామేష్టియాగం చేసాడు కదా! ఆ సందర్భాన్ని గుర్తు చేసింది.

ఇలా ఒకరినొకరు పరిహాసపూర్వకంగా, సరససంభాషణలతో, ఆత్మీయ పలకరింపులలతో సాగే వినోద భాషణం ఈ శ్లోకం. మనందరికీ ఆయురారోగ్యాలను ప్రసాదించి ఈ జగత్తును రక్షించాలనే కవి చమత్కారవర్ణన అద్భుతం కదా!

- ‘అవధాని’ ముత్యంపేట గౌరీశంకర శర్మ

అవధానపుష్కరిణి అన్ని సంచికలూ ఒకేచోట. ఈ QR కోడ్ స్కాన్ చేస్తే అంతర్జాలంలో ఇప్పటివరకు వచ్చిన అన్ని సంచికలూ ఒకేచోట కనపడ తాయి. అక్కడే చదువుకోవచ్చు లేదా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

కవికల్పలత - 3

కవి కల్పలతలో దేవేశ్వరకవి ఏక మొదలు సంఖ్యావాచకాలను తెలియజేశారు. అవధాని నిషిద్ధాక్షరిలో సంఖ్య బదులు సంఖ్యావాచకాన్ని చెప్పడం ద్వారా నిషిద్ధాన్ని సులభంగా ఎదుర్కొనవచ్చును. ఉదాహరణకు వేయిసంఖ్యకు దేవేశ్వరకవి గంగాముఖములు, శేషుని శిరములు, కమలపత్రములు, సూర్యకిరణములు, అర్జునుని బాణములు, సామవేదశాఖలు, ఇంద్రుని నేత్రములను సంఖ్యావాచకాలుగా పేర్కొన్నారు. అటుపై ఆ సంఖ్యా వాచకాలను వర్ణనలలో ప్రయోగించవలసిన విధానాన్ని కూడా తెలియజేశారు.

శబ్దములు రూఢములని, యౌగికములని, మిశ్రమములని మూడు రకాలు. ఆఖండల, మండప మొదలగు శబ్దములు ప్రకృతి ప్రత్యయ విభాగము చేత అర్థబోధకములు కావు. అందువల్ల వీటికి రూఢములని పేరు. గుణము, క్రియ, సంబంధముల చేత శబ్దార్థబోధ కలిగితే దానికి యోగము అని పేరు. ఆ పదములకు యౌగికములని పేరు. నీలకంఠుడు లేదా కాలకంఠుడు మొదలగు శబ్దములలో నీలత్వ, కాలత్వములు కంఠము యొక్క గుణములు. కావున వీటికి యౌగిక పదములని పేరు. వైశేషికులు సంఖ్యలను కూడా (సముదాయ వాచకములు) గుణములని అన్నారు – కాబట్టి పంచబాణుడు, షణ్ముఖుడు, దశగ్రీవుడు, ఏకదంతుడు మొదలగునవి కూడా గుణనిబంధన యౌగికములు. అయితే శుభ్రవపుడు, షట్కంధర మొదలగునవి కూడా గుణనిబంధన యౌగికములే అయిననూ కవిరూఢిచే ప్రసిద్ధములు కావు కావున వాటిని ప్రయోగించరాదని దేవేశ్వరకవి నిర్దేశించారు.



సంస్కృత క్రియాపదాలైన కరోతి, దధతి మొదలగువాటి యోగమున స్రష్టా, ధాతా మొదలగు పదాలు ఏర్పడుచున్నవి. ఇవి క్రియా నిబంధన యౌగికములు.

సంబంధము అనగా స్వీయ వస్తు యాజమాన్యము మొదలైనవి. స్వామి వాచక పదాలు ఆత్మీయ వస్తు వాచకములకంటే పరమైనప్పుడు నామములు ఏర్పడుతాయి. ఇవి సంబంధ నిబంధన యౌగికములు. భూమికి యజమాని అన్న అర్థంలో భూనేతా, భూపతి, భూభుక్, భూపాల, భూధవ మొదలగునవి సంబంధ నిబంధన యౌగికములు. ఇక్కడ ధనుంజయ నిఘంటువులోని 'తత్పర్యాయ పతిః ప్రభుః' అన్న సూత్రాన్ని అనుసంధానం చేసుకోవాలి. ఇది స్వస్వామి భావసంబంధం. అయితే కపాలమునకు యజమాని అన్న అర్థంలో శివుని పర్యాయపదంగా కపాల నేత, కపాలపతి అని వాడకూడదు. కానీ మత్వర్థంలో 'కపాలీ' అనవచ్చును.

కార్యవాచకముల మీద కారణవాచకములు ప్రయోగిస్తే అవి కర్తృపదాలైన నామవాచకాలవుతాయి. ఉదాహరణకు విశ్వము కార్యము, దాని కారణము బ్రహ్మ అందువల్ల విశ్వకర, విశ్వసూః, విశ్వకృత్, విశ్వకర్త, విశ్వస్రష్టా, విశ్వజనక, విశ్వకారక మొదలగునవి బ్రహ్మ అన్న అర్థాన్ని తెలియజేస్తాయి. అయితే చిత్రమునకు దానిని గీయువానికి జన్య జనక సంబంధం ఉన్నా చిత్రకార, చిత్రకృత్ మొదలగునవి ప్రయోగించవచ్చును కానీ చిత్రసూః, చిత్రజనక పదములకు రూఢి లేదని గ్రహించవలెను. అనగా అవి ప్రయోగార్హములు కావు. జనక వాచకం మీద ప్రయోగింపబడిన యోని మొదలగు శబ్దములు జన్యనామములగుచున్నవి. ఆత్మయోని, ఆత్మజ, ఆత్మజని, ఆత్మభూ, ఆత్మ సంభవ, ఆత్మరుహ, ఆత్మసూతి మొదలగునవి. వీటికి బ్రహ్మ అని అర్థం. ఇవికాక దైత్య, భార్గవ మొదలగు అణ్ ప్రత్యయాంతములు, వాత్స్యాయన, కాత్యాయన మొదలగు యఞ్ ప్రత్యయాంతములు జన్యనామములు (పుత్రవాచకములు) అగుచున్నవి.

వృషధ్వజః అను పదంలో వృషమునకు ధ్వజమునకు ధార్యధారక సంబంధం ఉన్నది. ధరింపబడెడు వస్తు నామముల కంటే పరముగా ధ్వజ, శేఖరాది పదముల పర్యాయపదములు ప్రయోగించిన ధారక నామములు ఏర్పడుతాయి. వృషధ్వజ, శూలాస్త్ర, పినాకపాణి, వృషాంక, చంద్రమౌళి, శూలాభృత్, శశిమండన, గంగాధర మొదలగునవి ఉదాహరణలు. ధ్వజాది పర్యాయ పదాలన్నప్పుడు వృషకేతన వృషలక్ష్మా, చంద్రశిరా, చంద్రభూషణ మొదలగునవి ఊహించు కోవాలి. ధార్య ధారక సంబంధం అన్నింటా సమానమే అయినా మత్వర్థములోని శూలి శబ్దమువలే సర్ప, శశి, హరిణి శబ్దములు; ఇందుమౌళి వలే గంగామౌళి శబ్దము కవిరూఢి లేని కారణం చేత ప్రయోగార్హములు కావని దేవేశ్వరకవి పేర్కొన్నారు.

భుజింపదగిన వస్తువునకు భోజ్యమని పేరు. భుజించువాడు భోక్త. భోజ్యవాచకము కంటే పరమైన భుక్, లిట్, పా, అంధస,

(మిగతా 15వ పేజీలో)

వ్రాడ్రేవు సత్యప్రసాదుగారి ఆధ్వర్యంలో
హైదర్ నగర్, వినయ్ గృహసముదాయ ప్రాంగణంలో
అవధానిని.డా.వేదాలగాయత్రీదేవిగారి
20వ అష్టావధానం

20.6.2026

సంచాలకులు: శ్రీమరుమాముల దత్తాత్రేయశర్మ

నిషిద్ధాక్షరి: తనికెళ్ళ సవిత

అష్టమగర్భం ధరించినపుడు దేవకీదేవి వేదన.

కం ఆవేదంబుల్ రూఢిన్
భావనలోన వరమునిచ్చు పాపడు ,తా ,యో
దేవకి! జనియించునుగద
నీవాదుఃఖము వదలుము నిజముగ శుభమౌ.

సమస్య: ప్రసూనాంబ

భర్తయె భామయౌటగని భార్యకు కల్గ హర్షమెంతయున్.

ఉ. నర్తనశీలియాతడయి నాటకముల్ రచియించు సృష్టి, స
ద్వర్తన లేనివారికిట వైద్యుడు ,మోహనరూపమందుచున్
నర్తన తోడశంభునికి నవ్వుచు దోపగ, గట్టుచూలియున్
భర్తయె భామయౌటగని, భార్యకు కల్గెను హర్షమెంతయున్.

దత్తపది: వరలక్ష్మి వీరన్న

వారము, కారము, సారము, దూరము - నేటి విద్యార్థులకు సందేశం - ఛందస్సు:స్వేచ్ఛ

ఉ. సారముఖారవింద! శుభఛాత్రుడ! దీక్షనుబూను విద్యలన్
దూరము జేసి దౌష్ట్యమును, తోషమునీయుము తల్లిదండ్రికిన్
వారమువారమున్ చదివి వైభవమందుము, బుద్ధితో నహం
కారము వీడుమా! సఫలగౌరవమందుమ! కీర్తనందుమా!

వర్ణన: బి.ఇందిర

హనుమ అంగుళీయకమిచ్చాక సీత మానసికస్థితి.

తరలం కనులబాష్పములుద్భవింపగ గాంచ నంగుళి సీతయే
మనసు దుఃఖపు భారమంతయు మైవసించగ, కాలమున్
జనదు, పూర్వపుగాథలన్నియు జ్ఞప్తిలో తిరుగాడగా
జనని రాముని గాంచుచుండెను సర్వదా శుభమెంచుచున్.

న్యస్తాక్షరి: సీతామహాలక్ష్మి

1-5-దా, 2-10-శ, 3-9-ర, 4-8-థి

సీతారాములయన్యోన్యత

చం. సమమునిద్(దా)నచిత్తములు సత్యమనోహర భావజాలముల్
రమణము మోహనాకృతి (శ)రాసనబద్ధవివాహబంధమై
సుమనసవంద్యభాసు(ర)ము శుద్ధయశోధన వర్తనమ్ముతో
నమలినదీప్తిసాధిత మహాగములు సీతయు రాములుర్వలో.

అప్రస్తుతం: నూకల అరుణ

చిత్రకవిత: మాధవి

తే.గీ. బ్రహ్మ ధేనువై క్షీరముల్ రహినొసంగ
గ్రోలె వైకుంఠనాథుడు కూర్మితోడ
పుట్టువిచ్చెడు దైవమే పుట్టనుండె
కలియుగంబున తావచ్చె కల్కిగాను.

ఆశువులు: తాడేపల్లి శ్రీదేవి

1. శ్రీకృష్ణ తులాభారంలో రుక్మిణీదేవి భక్తి

తే.గీ. రత్నమాణిక్యరాశుల లక్ష్యమిడక
పత్రపుష్పతోయములకై పట్టు పడుదు
నంచు తులసికి సమముగ నలరినాదు
భక్తిముఖ్యము మానవ! ముక్తికొరకు.

2. వామనుడు బలిచక్రవర్తినిమూడడుగులు యాచించటంలో ఆంతర్యం

ఆ.వె. చేయుచున్న కర్మ చేసినయాగంబు
పుష్టికొరకు తినెడి భోజనమును
భక్తిశ్రద్ధతోడ పరమాత్మకర్పించు
బలిని కోరినట్టి పదములివియె.

3. సమాజంలో మానవవిలువలు

కం. నైతిక విలువలు మానవ
జాతికి యోగంబునిచ్చు చైతన్యమగున్
ఖ్యాతిగ పరోపకారము
నీతికి సాధంబుగట్టె నిజమిది లక్ష్మీ.

మెదక్ పట్టణం అయ్యప్ప మందిరం 25వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా

అష్టకాల విద్యాచరణ్ శర్మ గారి తొలి అష్టావధానం

17. 06.2026

అధ్యక్షులు: మరుమాముల దత్తాత్రేయ శర్మ

సంచాలకులు: 'ద్విభాషాఅవధాని' ముత్యంపేట గౌరీశంకర శర్మ

నిషిద్ధాక్షరి: అష్టావధానిని మంచినీళ్ల సరస్వతీ రామ శర్మ

అయ్యప్ప వైభవం

కం. శ్రీదంబై శ్రేష్టమ్మై
వేదమ్మున్ బొంక జూచు ప్రేతన్ శాబ్దిన్
వేదన నిచ్చెడి దనుజుల
సాధించుచు గాచు మమ్ము శబరి గిరీశున్!

సమస్య: జనమంచి ఫణీంద్ర

పదుగురు మెచ్చుపద్యములు వ్యర్థములౌ నవధానమందునన్

చం. సదమలమైన చిత్తమున సాహితి సేద్యము సల్పకున్నచో
మెదలని భావ లేశములు మిక్కిలి స్తబ్ధత దెచ్చిపెట్టుగా
చదువది యెంత నుండినను సఖ్యత జాలనిప్పుచ్చకాళితో
పదుగురు మెచ్చు పద్యములు వ్యర్థములౌ నవధానమందునన్

దత్తపది: దమ్మన్నగారి ప్రసాద్ శర్మ

దాన, వీర శూర, కర్ణ అనే పదాలతో రామాయణార్థంలో

తే.గీ. కర్ణ పేయమౌ శ్రీరామ కథను వినిన
వీరహనుమాను డచ్చట చేరిపోవు
దానవేంద్రుల దునుమాడు ధైర్య మిడుచు
శూరతత్వంబు తెలిపెడి వీరగాథ!

వర్ణన: రావికోటి సోమేశ్వరరావు

అయ్యప్ప స్వామి వార్షికోత్సవాలలో భక్తుల యొక్క అనుభవం చంపకమాలలో

చ. ప్రవిమల భక్తి చాటుటకు భక్తులు చేరిరి యెక్కచోటనున్
కవనపు ధార సాగెనిట కష్టము లన్నియు కృంగిపోనటుల్
సవనము సల్ప యాజ్ఞికులు సాదృశమౌనటు దైవలీలలున్
శ్రవణము జేసిరందరును శ్రద్ధగ నా మణికంఠు గొల్చుచున్

ఆశువు: నల్ల అశోక్

పుత్రుని అవధానముచూచి కీ శే అష్టకాల వారి భావన

కం. చెప్పిన మాటలు వినడని
చప్పున భావించి నేను సాహిత్యమునన్
గొప్పగ పద్యము జెప్పగ
యెప్పుడుయబ్బిందొగాని యెరుగననేనున్

ఛందోభాషణం: సింగీతం నరసింహారావు

అంత్యాక్షరి: కట్టా శ్యామల

అప్రస్తుత ప్రసంగం: ములుగు లక్ష్మీ కిరణ్, జబర్దస్త్

11-07-2026 'నెలనెలా అవధాన దర్శనమ్' కార్యక్రమంలో భాగంగా శ్రీ భారతీ తీర్థ గ్రంథాలయం , దర్శనమ్ కార్యాలయంలో జరిగిన చి.నరసింహదేవర జయలక్ష్మి (13సం.ల బాలిక) సంస్కృత అష్టావధానం

ముఖ్య అతిథి: డా. దోర్బల ప్రభాకర శర్మ

సంచాలకులు: డా. ధూళిపాల మహదేవమణి

నిషిద్ధాక్షరి: ఆముదాల మురళి, శతావధాని

శ్రీదానీద్యాన్ హితాన్ భక్త్యా (దు, తు, మ, గు, మ)
వరాన్ వాణ్యాః పదం ధృతాన్। (ను, దు, రు, రు, ను, మ)
వేదాన్గనపాథోధీన్
వందే నిత్యం జగద్గురూన్॥

సమస్య: మండపాకమహేశ్వరి, అవధానిని

జ్వాలాకులేహిదహనే కమలం విభాతి

లోకేతినీచవిధియుక్తకుయోచనాఢ్యే
గోవిన్దపాదకమలాభిదభవ్యనౌకాః।
భాంత్యార్యగీతచరితాః పరమాః యుధాహో
జ్వాలాకులేహిదహనే కమలం విభాతి॥

దత్తపది: డా. జి.ఎం. రామశర్మ, శతావధాని

పావనం-భావనం-సేవనం-జీవనం - మాలినీవృత్తే - దర్శనం పత్రికాయాః సనాతనధర్మసేవాయాః వర్ణనమ్

శ్రుతినిరతసుసేవాభావనంరాధసంస్థా
ధృతమఖిలజనానాం పావనం ధర్మమార్గమ్।
కృతమమలమిహాహోధాంకితం జీవనం స్వం
గురుచరణసరోజే సేవనం కర్తుమద్య ॥

వర్ణన: ప్రొ. పెన్నా మధుసూదన్, సంస్కృత అకాడమీ సంచాలకులు

శృంగేర్యాం భాతి భారతీ

(మిగతా 23వ పేజీలో)

పురాణతోరణం

నిర్వహణ: 'అష్టావధాని' కంది శంకరయ్య

సమస్య

"పుత్రునితో హిరణ్యకశిపుం డనె విష్ణు వొకండె దైవమౌ"

పాతూరి సుబ్రహ్మణ్యకవి, తెనాలి

చిత్రమదేమొ దైత్యులకు సేమము నెంచని చక్రి, యుండు స
ర్వత్ర యటంచు జూపితివి రమ్యనృసింహుని స్తంభమందునన్,
మిత్రునివోలె వైరికిని మిన్నగ నింకను భ్రాంతితోడుతన్
పుత్రునితో హిరణ్యకశిపుండనె విష్ణువొకండె దైవమౌ!

రాకుమార, గోదావరిఖని

ధాత్రిని సేమమొందెడి విధాత మహాత్మ్య వరంబునెంచి సౌ
భ్రాత్రుడు తల్లి తండ్రియు సపత్నియు మెచ్చగ వంశదీప్తియౌ
పుత్రునితో హిరణ్యకశిపుండనె విష్ణువొకండె దైవ మౌ
నే, త్రిజగంబులెల్ల యధినేతగనన్ను భజించుచుండగన్.

పెనుకొండ రామబ్రహ్మం, బెంగుళూరు

పుత్రునితో హిరణ్యకశిపుండనె, "విష్ణువొకండె దైవమౌ?
ఛత్రముఁ బట్టి బ్రహ్మ యిటు శంకరుఁ డెప్పుడు బ్రోచు చుండఁగన్
మిత్రులు దైత్య వీరులకు మేదిని నెవ్వరటంచుఁ దెల్పినన్
శత్రువు నాదు భ్రాతనటు చంపిన ధూర్తుఁడు దేవుఁడయ్యెనే!"

గుండా వేంకట సుబ్బ సహదేవుడు, ప్రొద్దుటూరు

ఆత్రము దీరదేమి సుత! యంతగ గొల్చిన వైరి శ్రీహరిన్
జిత్రము నీదు పోకడలు శిక్షలకైనను మార"వంచుఁ దా
పుత్రునితో హిరణ్యకశిపుండనె, "విష్ణువొకండె దైవమౌ!
సూత్రము నందుఁ జిక్కితివె! సుంతయుఁ దండ్రిని గొల్వవేమిరా!"

వేగరాజు సాయి వర ప్రసాద్, హైదరాబాదు

ఆత్రముతోడ జూడగ నియామముగన్ వ్యసనంబు చందమౌ,
స్తోత్రము జేయుచున్ హరిని శుద్ధ మనస్సుని రీతిలోన నా
పుత్రునితో హిరణ్య కశిపుండనె "విష్ణుడొకండె దైవమౌ
పాత్రత జూప రమ్మనుము భక్తునికై చని కంబమందునన్"

అన్నపరెడ్డి సత్యనారాయణ రెడ్డి, హైదరాబాదు

పుత్రునితో హిరణ్య కశిపుండనె 'విష్ణువొకండె దైవమౌ
నే?' త్రిపురాంతకుండయిన నీలగళుండె నిజంపు దైవమౌ
ధాత్రిని భక్తపాళిఁ గని తప్పక బ్రోచుచు నుండునెప్డు స
చ్ఛాత్రుడవై గురుండొసగు చక్కని విద్యల నేర్చి మించుమా

డా. వేదాల గాయత్రీదేవి, హైదరాబాదు

పాత్రుడు గాడు పూజలకు బద్ధవిరోధియె రాక్షసాళికిన్
దాత్రముతో వధించె గద ధాత్రిని నాదు సహోదరున్ కటా
పుత్రునితో హిరణ్యకశిపుండనె, విష్ణువొకండె దైవమౌ
త్రాతయు ధర్మమూర్తి యని తండ్రికి చెప్పెను బాలుడంతటన్.

ఆకుల శాంతిభూషణ్, వనపర్తి

పుత్రునితో హిరణ్యకశిపుం డనె " విష్ణు వొకండె దైవమౌ
ధాత్రికి నంచు ద్వేషణుని దల్చుచు గొల్చుట యేల? బాలకా!
ఆ త్రిపురారి దీన శరణార్థుల బాంధవు డా లలాటపున్
నేత్రుడె దైత్య రక్షకుడు నీవిక త్ర్యంబకునిన్ స్మరించుమా!

కటకం సూర్యనారాయణ మూర్తి, బెంగుళూరు

పుత్రునితో హిరణ్యకశిపుం డనె విష్ణువొకండె దైవమౌ
నే త్రిజగంబులందు నను నెగ్గెడి వీరుడు లేడెరుంగవే
శత్రు భయంకరుండ విను స్వామిని నేనె సమస్త సృష్టికిన్
మిత్రుడు గానె గాడు హరి మీరి చరింపకు నాదు నానతిన్

పి.యల్. నాగేశ్వరరావు, హైదరాబాదు

శత్రువు శ్రీహరిన్ గొలుచు సంస్కృతి వీడుమటంచు బాలుడౌ
పుత్రునితో హిరణ్య కశిపుండనె! "...విష్ణువొకండె దైవమౌ
మిత్రుడు, శిష్టరక్షకుడు, మేలును గూర్చెడి దేవదేవునిన్
స్తోత్రముచేయ మాననని.." సూటిగఁ దెల్పెను బిడ్డడత్తతిన్!!

కశోర్ఘుల నాగేశ్వర్ శర్మ, ధర్మపురి

శత్రుని గూర్చి యోచనను సల్పుచునుగ్రముతో హరిన్ దల్పన్
మిత్రుని వోలెఁబిల్చుచు సమీపముఁ రమ్మని కూర్మితో కనన్
పుత్రునితో హిరణ్యకశిపుండనె విష్ణువొకండె దైవమౌ?
పాత్రత గుర్తెరింగి కడు భక్తిని గొల్వుము పార్వతీ పతిన్.

దత్తపది

వాన, జల్లు, ముసురు, వరద

(పై పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ వేసవి తాపాన్ని వర్ణిస్తూ స్వేచ్ఛా ఛందస్సులో పద్యం వ్రాయండి)

వేదాల గాయత్రీదేవి, హైదరాబాదు

వానకాళ్ళుగ ప్రసరించి వాడి కలిగి
గుండె మండగ కిరణాల నిండుజల్లు
ముసురు చుండగ వేసవి ముంచివేసె
స్వేదమువరద యై మేన వేదనలిడె.

అన్నపరెడ్డి సత్యనారాయణ రెడ్డి, హైదరాబాదు

వారిజనేత్ర! శౌరి! కనవా! నరజాతి విషాదమున్ దయన్
ఘోరపు వేడి జల్లు మన గుండియ, వేదన పొందుచుండిరే
వారని శక్తితో ముసురు భాను మయూఖపు ధాటి నిల్పు, మా
ధారము నీవె భక్త వరదా! దరి జూపుమ దంగఁ గ్లేశముల్

శ్రీనివాస్ లింగం, దుబాయ్

వానరాది జంతువులెల్ల కానలందు
జల్లుకొని సుడివడు, త్రాగు జలముకొరకు
పాపము సురుగు నొందుచు, వాడి గ్రీష్మ
తాపమందు! వరదరాజ దయనుజూపు.

రాకుమార, గోదావరిఖని

వానర నర పసర ఖగ వనధియందు
నిప్పులెగజల్లుచు మహిని నిలువరించి
జీవరదమొకింతయు చిట్లి సెగలనుమియ
జవము సురుగు తెఱగున వేసవి చెలంగె.

వేగరాజు సాయి వర ప్రసాద్, హైదరాబాదు

వానరులకు ప్రియమగు ద్రువ
లానక జల్లుమను గుండె యతి తాపముతో,
ప్రాణము సురుచిరముగ నిలు
వైనముగను వరదగొనిన ప్రకృతి హరితమై.

గుండా వేంకట సుబ్బ సహదేవుడు, ప్రొద్దుటూరు

నింగి నేలఁగురిసె నిప్పుల వానలు
మూడునెలలుమించి ముసురుఎండ
చెమట జల్లులొలికె జీవతతికకటా!
భక్త వరద! కావ వర్షమిడుమ!

పాతూరి సుబ్రహ్మణ్యకవి, తెనాలి

మహదానందమునన్ జిగుళ్ళఁ దిని యింపారంగ పోవా నయం
బహహా, జల్లన మేను పంచమమునం దందంబుగా గూయ నీ
అహమున్ మార్కొన పాడలేము; సురులే యండంచు నా ఫుల్గు లే
ద్వ; హరించెన్ ఘనకీలలన్ వర దయాభాస్వంతుడా కోయిలన్!

పెనుకొండ రామబ్రహ్మం, బెంగుళూరు

వరలెడు గ్రీష్మ తాపమున వానర చేష్టలు తొట్రుపాటుతో
స్థిరముగ జల్లుకొన్న వయి చిందులఁ ద్రొక్కఁగఁ జూడమే జనుల్
విరసము నెల్లరన్ ముసురు వేగమ దేహము డస్సి పోవఁగన్
వర దశకంఠవైరి కృప వర్షపు రూపునఁ దాల్చ క్షీణమౌ!

ఆకుల శాంతిభూషణ్, వనపర్తి

ప్రతి రోజల్లుచు నీవు మేటి ద్యుతి శుల్బమ్ముల్ ధరన్ గ్రీష్మమం
దతి పీడించుచు నిచ్చల మ్ముసురు తీయన్ భావ్యమేలన్ రవీ!
గతి దప్పెన్ క్రియలన్ని దేవర! దయన్ కర్తవ్యమంచున్ వెసన్
బ్రతుకున్ మాకిడి బ్రోవు మగ్గలము దేవా! నమ్ము మా ప్రార్థనల్

కటకం సూర్యనారాయణ మూర్తి, బెంగుళూరు

దావానలమా యన్నటు
లీ వేడి సెగ లెగజల్లు టెటు లోర్తుమయో
కావగవలె మము సురులే
హే వరద మము కరుణింపు మెంతయు వేడ్తున్

కొరుప్రోలు రాధాకృష్ణ రావు, మీర్పేట్

ఈవా! నయముగ వానలు
దేవా! జల్లనగ గుండెఁ దీక్షపు వడలో,
గావగ ముసురుకొనిన తా
పావసరము దీర్చ రార వరద! ముకుందా!

పి.యల్. నాగేశ్వరరావు, హైదరాబాదు

ఆహ్వానములులేని యతిథులై ఋతువులు
క్రమము దప్పక ధరఁ గలియతిరుగు!
మండుటెండలలోని మార్తాండ తేజంబు
వేడిమి వెదజల్లు విరివిగాను!
వేసవి తాపమ్ము వెంటాడ మనుజుని
ముప్పేట వ్యాధులు ముసురుకొనును!
వరదత్తమైనట్టి వాతావరణమందు
తగిన జాగ్రత్తలు తప్పవెపుడు!!
నీడపట్టున గడుపుచు నీరుఁ ద్రావి
చల్ల సేవింప దేహమ్ము చల్లబడును!
స్త్రీలు,వృద్ధులు, పిల్లలు తీరుబడిగ
నింటనుండుట మంచిదౌ నిట్టివేళ!

సమస్య: ‘బావా రమ్మని పిల్చె స్నేహ మెసఁగన్ బార్థుండు దుశ్శాసనున్’
దత్తపది: ‘గో - రన్ - కమ్ - వాక్’ పదాలతో ‘పల్లె సౌందర్యాన్ని’ వర్ణిస్తూ ఉత్పలమాలలో పద్యం
(పూరణలు **15** ఆగస్టు **2026** లోపు **7702121376** ఫోన్ నంబరుకు పంపాలి)

(11వ పేజీ తరువాయి) **నిఘంటు పరిజ్ఞానం**

ఆశా, అశన మొదలగు పదములు భోక్తృ వాచకము లగును. అమృతము భోజ్యము, దేవతలు భోక్తలు, భోజ్యభోజక సంబంధము చేత అమృత భుజః, అమృతలిహా, అమృత పాయినాః, అమృతాంధసః, అమృతవ్రతాః, అమృతపాః, అమృతాశాః, అమృతాశన మొదలగునవి దేవతల పర్యాయవాచకములగుచున్నవి. అమృతము దేవతలకు మాత్రమే భోజ్యము, కావున ఇవి దేవతలకు మాత్రమే పర్యాయ పదవులగును.

కావ్యదోషాలు

డా॥ సూరం శ్రీనివాసులు

అశ్లీలం

వామనుడు ప్రతిపాదించిన పదార్థదోషాలలో మరొకటి అశ్లీలం. 'అసభ్యార్థాంతరమ్, అసభ్యస్మృతి హేతుశ్చ అశ్లీలమ్' అని అశ్లీల దోష లక్షణం. లక్షణంలోనే అశ్లీలదోషంలోని రెండు విధాలను చెప్తున్నాడు వామనుడు. పదానికున్న అనేకార్థాలలో ఒకటి అసభ్యమైన అర్థమైనపుడు సభ్యార్థంలోనే అయినా ఆ పదాన్ని వాడటం అశ్లీలదోషం. ఇది నానార్థాలు గల పదాలకు సంబంధించినది. ఒకే పదంలోని కొంత భాగం అసభ్యస్మరణకు కారణమైతే అది కూడా అశ్లీల దోషమే. ఈ దోషం పాఠకుడి పద పరిజ్ఞానం మీద ఆధారపడి వుంటుంది. అంటే ఒక్కొక్కసారి పాఠకుడికి ఎక్కవ తెలియటం కవికి ఇబ్బందిని కలిగిస్తుంది. కవి పాఠకుల స్థాయీ భేదం ఈ దోషానికి ఆకర మవుతుంది.

ఉదా–

ఆ దుష్యంతుఁ డనంత సత్త్వుఁడు సమస్తాశాంత మాతంగ మ
ర్యాదాలంకృతమైన భూవలయ మాత్మాయత్తమై యుండఁగా
నాదిత్యాంశు సమీరదుర్గమ మహోగ్రారణ్యదేశాళితో
నాదిక్షత్ర చరిత్రనేలె నజితుండై బాహువీర్యంబునన్

(ఆంధ్రమహాభారతం–ఆది–4/8)

ఇక్కడ బాహు'వీర్యంబునన్' అన్న సమస్తపదంలోని 'వీర్యంబునన్' అన్న శబ్దం అనేకార్థకం. పరాక్రమం, తేజస్సు, వీర్యం వగైరా అర్థాలు. 'వీర్యంబునన్' అన్న నన్నయ్య ప్రయోగంలో కవి తాను వివక్షించిన అర్థం 'పరాక్రమంతో' అని. అయితే 'రేతస్సుతో' అని అసభ్యార్థస్మృతి అక్కడ కలుగుతుంది. కాబట్టి అశ్లీల మనే దోషం. 'రేతస్సుతో' అనే అర్థస్ఫూర్తి అసభ్యమా? సభ్యమా? అన్న చర్చ ఇక్కడ మనం చేయటం లేదు. సాధారణంగా లోకవ్యవహార మర్యాద మేరకు అది అశ్లీలార్థ స్ఫూర్తియే. అందునా పూర్వపదం 'బాహు' కావటం మరీ విశేషం.

అశ్లీలతలోని రెండవ భాగం పదైకదేశం ద్వారా అశ్లీలత. పదం సభ్యార్థకమైనా పదంలోని కొంత భాగం అసభ్యార్థాన్ని ఇవ్వటం. ఉదాహరణం –

సారమతిం గవీంద్రులు ప్రసన్నకథాకలితార్థయుక్తి లో
నారసి మేలునా నితరు లక్షరమ్యత నాదరింప నా
నారుచిరార్థసూక్తినిధి నన్నయ భట్టు తెనుంగునన్ మహా
భారతసంహితారచన బంధురుఁడయ్యె జగద్ధితంబుగన్

లోన్ ఆరసి అంటే లోతుగా పరిశీలించి అని వివక్షితార్థం. ఇందులో విప్రతిపత్తి లేదు. అయితే ఆరసిలో ఏకదేశమైన 'రసి' అశ్లీలార్థాన్ని ఇస్తుంది. తరువాత చెప్పబోయే అశ్లీలతా భేదాల్లో జుగుప్సాదాయిత్వం(వెక్కసపాటు) కూడా ఒకటి. కొందరికి కొన్ని పదాలు వినగానే కడుపులో దేవినట్టు అవుతుంది. అదే జుగుప్స. ఆరసిలోని ఈ రసి పదం ఆ జాతికి చెందినవది.

మరొక ఉదాహరణం చూద్దాం –

తాను రసవతికిన్ మెప్పుఁదలల నిచ్చు
నిరత రుచిరాన్నదాన సన్నిహిత హృదయ
వండి వండించి వార్పించు నిండుకుండ
యాఁకటింటిచ్చుఁ జల్లార్చు నమృతసదయ

ఇక్కడ అన్నపూర్ణవంటి ఒక మహిళ వర్ణన. అన్నదాత్రి కాబట్టి ఆమెకు రసవతి–వంటిల్లు– అంటే ఇష్టం. అయితే ఆ రసవతిలో సవతి చేరింది. ఆమెకు కూడా మెప్పుదలల నివ్వగలిగినది తాను అనటంలో అశ్లీలం లేదు గాని, తద్భేదమైన ఆతంకదాయిత్వం ఉంది. కావ్యాలలోని ఏ దక్షిణనాయకులకో తప్ప సాధారణం బహుభార్యాత్వం అసౌకర్యంగానే భావింపబడుతుంది.

ఒక్కొక్కసారి పదం అశ్లీలం కాకపోయినా రెండు పదాల సంధి వల్ల అశ్లీలార్థం స్ఫురిస్తుంది. ఒక ఉదాహరణం చూద్దాం – సన్నిధానంవారు కావ్యాలంకారసంగ్రహవ్యాఖ్యలో ధీరలలితుడికి ఉదాహరణగా ఇచ్చిన పద్యం –

ఒకసారి పీయూషమొలకఁలింపఁగఁ జేయు
    గానంబు గావించు వీణె ముట్టి
యొక తేపఁ గనువిందులకు విందు లొనరించుఁ
    జిత్తర్వులకుఁబోసి జీవకళలు
ఒక తేప నొజ్జల కొజ్జయై వర్తిల్లు
    ద్యూతప్రసంగవైదుష్యమందు
ఒకసారి మదపుటేనికల గొట్టెలనట్లు
    వెంటఁద్రిప్పుచునుండు వేఁటలందు
గీ: ఒక్కపరి నృత్యకళయందు; నొక్క తడవ
సరస సల్లాపములయందుఁ జదురుసూపు

మోపి యౌగంధరాయణు మూపురమున
రాజ్యభారంబు నా వత్సరాజవరుఁడు

ధీరలలిత నాయకవర్ణన మిది. లాలిత్యం కలిసి వున్నా ధీరత్వం కోల్పోని వాడు ధీరలలితుడు. "వృత్తారింబోలిన భోగి ధీరలలితుండై పొల్చు నిశ్చింతతన్" రామరాజభూషణుడిచ్చిన ధీరలలిత లక్షణం. ఆ దశలో 'ఒక తేప నొజ్జల కొజ్జయై' అని(ఒజ్జలకు+ఒజ్జ) సంధిగతంగా ఆ నాయకుణ్ణి కొజ్జను చేయటం అశ్లీలతకు పరాకాష్ఠ. అయితే అది సంధివశంగా వివక్షితార్థానికీ, ధీరలలిత లక్షణానికీ భిన్నమైన అర్థాన్నిస్తూ కంటికింపుగా వుంది.

వివక్షితార్థానికి భిన్నమైన అర్థాన్నిచ్చే మరొక అమంగళకరమైన అశ్లీలాన్ని గమనిద్దాం.

కేతనతోడఁ బొత్తునకుఁ గేల్ కలపందలపోసి కాదు, నీ -
చేతము మెచ్చఁగాఁ గవిత చెప్పఁగ నేర్తు మటంచుఁ గాదు, వి
ఖ్యాతికిఁగా దిఁకేమనిన నద్యతనాంధ్ర కవిప్రపంచ ని
ర్మాతకు భక్తి మై నుడుగరల్ ఘటియించెడి పూన్కియే సుమీ!

సౌందరనందము - కృతి సమర్పణము - 5

పింగళి-కాటూరి కవులు సౌందరనందాన్ని తమ గురువైన చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి గారికి కానుక చేస్తూ వ్రాసుకొన్న పద్యాలలో ఇది ఒకటి. చెళ్ళపిళ్ళ వారి షష్టిపూర్త్యుత్సవ సమయంలో భక్తిభావంతో ఇస్తున్న దక్షిణ ఇది. అయితే - భక్తిమై నుడుగ - వరకు విభక్తమైతే ఆ పదాల కలయిక భక్తి-మైన్ = శరీరంలో - ఉడుగన్ = నశింపగా అన్న అర్థాన్ని ఇస్తోంది. ఉడుగర కాస్త శరీరంలోని భక్తిని కృశింపజేసింది. ఇది అమంగళకరం.

ఈ సందర్భంగా మనమొక విషయాన్ని మనస్సులో భావింపగలగాలి. ఆదికవియైన నన్నయ కవిత్వంలో దోషాలా? అని ఆశ్చర్యనడనవసరం లేదు. 'గచ్ఛతః స్ఖలనం క్వాపి' - నడిచేవాడికే జారుబాటుకు అవకాశం. ఒకటి రెండు దొసగునిసువులు ఉన్నంత మాత్రాన వారి మహాకవిత్వానికీ, ఋషిత్వానికీ లోటేమీ కాదు. మనం తప్పులు చేస్తూ వారితో పోల్చుకొని తప్పుల విషయంలో మురిసిపోవటం మూర్ఖత్వమే. శివుడు హలాహలం మ్రింగాడు గదా అని మనమూ విషం మ్రింగితే ఆయన మిగిలాడు కానీ మనం ఆయన దగ్గరకే వెళ్ళవలసి వస్తుంది.

సాహిత్య పరిశీలనలో ఒక దోషం కనిపిస్తే దాన్ని ఎత్తిచూపితే దాన్ని చిన్నతనంగా భావించుకొనే కవులు ఉండవచ్చు. అది పసితనం. ఆనందవర్ధనుడు ధ్వన్యాలోకంలో "అస్మిన్నతి విచిత్ర కవి పరంపరా వాహిని సంసారే కాళిదాస ప్రభృతయః ద్విత్రాః పంచషా ఏవ వా మహాకవయః ఇతి గణ్యంతే" అని కాళిదాసు పేరు మాత్రమే పలికి ఇద్దరో, ముగ్గురో, అయిదుగురో, ఆరుగురో మహాకవులు ఉంటారు అని కాళిదాసును మాత్రమే ఉన్నత శిఖరంపై నిలిపాడు. అయితే క్షేమేంద్రుడు తన ఔచిత్య విచారచర్చలో కాళిదాసు శ్లోకాలను ఉదాహరణలుగానూ, ప్రత్యుదాహరణలుగానూ ఇచ్చాడు. అంతమాత్రాన కాళిదాసు మనలాంటి కవి కాదు.

కావ్యాలంకార సంగ్రహంలో భట్టుమూర్తి 'లజ్జాకరము అశ్లీలము' అని నిర్వచించి, "పద్మిని **సరసాంగజగృహము** పద్మసౌరభమనగన్" అని ఉదాహరణమిచ్చాడు.

నానార్థకపదాలలో ఏ ఒకటో అసభ్యంగా కనిపించినంత మాత్రాన ఇక ఆ పదాన్ని ప్రయోగించటం మానవలసినదేనా? కొన్ని పదాలను లోకంలోని వ్యవహారంలో ప్రసిద్ధికెక్కిన కారణంగా అసభ్యతను కూడా ఆ పదం కోల్పోతోంది గదా! ఈనాటి తెలుగులో 'రేప్' పదం అలా సభ్యపదమైపోయింది గదా! అందుకే వామనుడు అటువంటి పదాల ప్రయోగ విషయంలో కొంత వెసులుబాటును సూచించాడు.

'న గుప్తలక్షిత సంవృతాని' - ఒక వేళ అసభ్యార్థం గుప్తంగా(చాటుగా=అందరి ఎరుకలో లేకుండా) ఉన్నా, అది లక్షితమైనా(లక్షణా శక్తిచేత ఏర్పడినదైనా), సంవృత్తం (లోక ప్రసిద్ధమై పోవటం సభ్యార్థంగా) అయినా దోషం లేదని సూచించాడు. 'సంబాధ' పదానికి అసభ్యమైన అర్థమున్నా, అది అందరికీ తెలియదు కాబట్టి తప్పు లేదు. 'జన్మభూమి' - ఈ పదం మాతృదేశం అనే అర్థంలో రూఢం అభిధచేత. అందువల్ల దానికి లక్షణతో అసభ్యార్థం స్ఫురించినా అభిధకే ప్రాధాన్యం. మూడవది సంవృత్తం. - ఇది చాలా ప్రసిద్ధమైన, అవసరమైన అంశం రచయితలకు. "సుభగ, భగిని, అభిప్రేతం, కుమారి, ఉపస్థానం..." వగైరా పదాలు లోకం స్వీకరించినవి సభ్య పదాలుగా. కాబట్టి దోషం లేదు. ఈ ప్రకరణంలో ఒక ప్రసిద్ధ ఉదాహరణాన్ని చూపించాడు వామనుడు -

సంవీతస్య హి లోకేన నదోషాన్వేషణం క్షమమ్ ।
శివలింగస్య సంస్థానే కస్యాసభ్యత్వభావనా ॥

లోకం గ్రహించిన పదాల విషయంలో దోషాన్ని వెతుక గూడదు. శివలింగాన్ని చూస్తే ఎవరిలోనైనా అసభ్యభావన కలుగుతోందా?

ఈ అశ్లీల దోషం మూడు విధాలు. వ్రీడాకరం, జుగుప్సాకరం,

(మిగాతా 19వ పేజీలో)

అంశావలోకనం

శతావధాని ఆముదాలమురళి

దుష్కర ప్రాసలు

పద్యంలో మొదటి అక్షరం యతి అక్షరం, రెండవది ప్రాసాక్షరం. తెలుగు పద్యానికి యతి ప్రాసలు సహజాలంకృతులు. సాధారణంగా అన్ని వృత్తాలలోను, జాతిపద్యాలలోను ప్రాస నియమం ఉంటుంది. ఉపజాతులలో ప్రాస ఉండదు కానీ ప్రాసయతి ఉంటుంది. ప్రాసలో హల్ సామ్యమే తప్ప అచ్ సామ్యం అవసరం ఉండదు. ఉదాహరణకు వకు వీ, వే, వై ఇలా ఏదైనా ప్రాసగా చెల్లుతుంది. ప్రాస నియమం ఉన్న పద్యాలలో ప్రాస పూర్వాక్షర నియమం ఉంటుంది. అనగా ప్రాస పూర్వాక్షరం మొదటి పాదంలో లఘువైతే అన్ని పాదాల్లో లఘువే కావాలి. గురువైతే గురువే కావాలి.

ప్రాసాక్షరం బిందు పూర్వకమైనా, ద్విత్వ సంయుక్తాక్షరమైనా నాలుగు పాదాల్లోనూ అదే హల్ సముదాయం ఉండాలి. అచ్ సామ్యం అక్కరలేదు. కేవలం అచ్చుమాత్రమే ప్రాసగా ఉన్నప్పుడు కూడా ఈ నియమమే వర్తిస్తుంది. అనగా అ,ఇ, ఉ, ఋ, ఎ.... మొదలగు వాటిలో ఏవైనా ఉండవచ్చును. సులక్షణ సారంలో స్వరయతిని గూర్చి చెప్పే పద్యాన్ని చూడండి -

అఆ ఇ ఔలకుమరి
ఇఈలు ఋకార సహిత మెఏలకు నౌ
ఉఊల్దమలో నొడబడ
ఒఓలకు వళ్ళగుననయోన్నత చరితా ! - ఇందులో

ప్రాసస్థానంలో వరుసగా ఆ, ఈ, ఊ, ఓ అన్న అచ్చులున్నవి. హల్లు లేదు కనుక అచ్ సామ్యం అవసరం లేదు కాబట్టి ఈ ప్రాస శాస్త్రీయమైనదే. ఈ పద్యంలో ప్రాసకు ముందున్న హల్లులు గురువులు. అందుకు కారణం వాటిపై ప్రాసస్థానంలోని అచ్చు యొక్క ఊనిక (stress). ఇలాంటి అచ్చుప్రాసతో పద్యం చెప్పాల్సివచ్చినప్పుడు అఆలు, ఇఈలు.. ఇలా ప్రయోగించడం ద్వారా ప్రాస నిర్వహణ చేయవచ్చు. లేదా వ్యాకరణం ద్వారా అచ్చును సాధించుకొనవచ్చును. అలా సాధించడం సంస్కృత పదాలలో సాధ్యమౌతుంది తప్ప తెలుగులో కాదు. యడాగమ, నుగాగమాలు అడ్డంకిగా మారుతాయి. సమస్యాపూరణంలో ఇలాంటి వాటిని పూరించేటప్పుడు అవధానికి ఉపయుక్తమయ్యే వాటిని చూద్దాం.

గోశబ్దమునకు అకారాది అచ్చులు పరమగునపుడు గవ-గవ్-గ అనే ఆదేశాలు వస్తాయి. 'గ' ఆదేశముగా వచ్చినప్పుడు సంధిరాదు.

అది అచ్చు ప్రాసగా ఉన్న సందర్భంలో ఉపయోగపడుతుంది.

గో + ఆలయము = గవాలయము, గ ఆలయము

గో + ఇందువు = గవేందువు, గవిందువు, గ ఇందువు

గో + ఈశుడు = గవేశుడు, గవీశుడు, గఈశుడు

గో + ఉత్కరము = గవోత్కరము, గవుత్కరము, గఉత్కరము

గో + ఋషభములు = గవర్షభములు, గవృషభములు, గఋషభములు

గో + ఏధితము = గవైధితము, గవేధితము, గఏధితము

గో + ఐశ్వర్యము = గవైశ్వర్యము, గ ఐశ్వర్యము

గో + ఓఘము = గవౌఘము, గవోఘము, గఓఘము

గో + ఔషధము = గవౌషధము, గఔషధము

శ్రీసన్నిధానం సూర్య నారాయణశాస్త్రిగారి తత్సమ చందిక నుండి సేకరణ)

ఇందులో గ ఆదేశముగా వచ్చిన రూపాలను గణానుసారిగా మరియు సందర్భానుసారిగా ఉన్నవాటిని ప్రయోగించవచ్చును. ప్రకృతిభావము అనగా అచ్చంధి జరుగవలసిన కొన్ని చోట్ల సంధి జరుగదు. అటువంటి చోట్ల పదం మధ్యలో అచ్చు ఉ ంటుంది. భో ఇన్ద్ర, హేఈశ మొదలగునవి. సంస్కృత ద్వివచన పదాల చివరి అచ్చులు గా ఈ, ఊ, ఏ ఉంటే వాటి తర్వాత వచ్చే అచ్చులతో సంధిజరుగదు (ప్రగృహ్యసంజ్ఞ) హరీపతే, విష్ణూ ఇమౌ, గజ్గేఅమూ మొదలగునవి. అదేవిధంగా హ్రస్వ ఋ పరమైతే అ, ఇ, ఉ, ఋ, ఇలకు ప్రకృతి భావం వైకల్పికం. అనగా -

బ్రహ్మ+ఋషిః = బ్రహ్మర్షిః, బ్రహ్మఋషిః

వర్ష+ఋతువు = వర్షర్తువు, వర్షఋతువు - ఇందులో

సంధి జరగని రూపాన్ని 'అచ్' ప్రాసకు వినియోగించవచ్చును.

విసర్గలోపించి సంధి జరుగక అచ్చులు యథాతథంగా ఉండే రూపాలను గూర్చి అవధానికి అవగాహన ఉంటే ఈ ప్రాసను సులభంగా నిర్వహించవచ్చును.

హ్రస్వ అకారం తర్వాత ఉండే విసర్గకు హ్రస్వ అకారం మినహా మిగిలిన అచ్చులు పరమైతే విసర్గలోపిస్తుంది.

భీమః + ఆగతః = భీమఆగతః

యుధిష్ఠిరః + ఇచ్ఛతి = యుధిష్ఠిర ఇచ్ఛతి

కః + ఇచ్ఛతి = క ఇచ్ఛతి

అర్జునః + ఉవాచ = అర్జున ఉవాచ - మొదలగునవి.

దీర్ఘ అకారం తర్వాత ఉండే విసర్గకు ఏ అచ్చు పరమైనా విసర్గలోపిస్తుంది.

ప్రేక్షకాః + అపశ్యన్ = ప్రేక్షకా అపశ్యన్

సేవకాః + ఉద్యానం = సేవకా ఉద్యానం

బాలాః + అతుష్యన్ = బాలా అతుష్యన్ –మొదలగునవి

ఈ సూత్రాలు గమనించిన తర్వాత ఆచార్య బేతవోలు రామబ్రహ్మంగారు పూరించిన ఈ సమస్యను చూద్దాం.

స ఉదగ్ర ప్రతిభా సమన్వితమతిః సత్కారయోగ్యో2పి చై
ష ఇదానీంతన చందభాను కిరణైః సంతప్త మానాత్మ దే
హ, ఇహోయాలి సఖీ! గృహాన కలదే నర్పింపు మొక్కింత స
ద్య ఉదస్విత్తున గాక యే గతి నుదన్యా వహ్న చల్లారెడిన్.

ఇందులో ప్రాసలో అచ్చులు రావడానికి సంస్కృత మర్యాదననుసరించారు.

డా॥ కడిమిళ్ళ వరప్రసాద్‌గారు పూరించిన సమస్య–

అఆలు నేర్చునాడే
ఉఊ అనకుండ శివుని నూరక గొలిచెన్
అఆ యనకుండగనే
గోఅగ్రణి నెక్కి శివుడు గోరిపు గాచెన్

– ఇందులో అచ్చులు, వాటి ఊనిక అక్కరకు వచ్చాయి. దుష్కరమైన ప్రాసల్లో ఇదొక్కటి.

(1వ పేజీ తరువాయి)

సంస్కృత ప్రియంభావుకత్వము

ఇక్కడ కూడా నాల్గవ పాదంలో **"నిషధపతి"** అనే పదంతో పద్యం (భావానికి సంబంధించినంత వఱకు) ముగిసింది. కానీ, మళ్ళీ చివరలో **"నలున్"** అనే పదాన్ని వాడినాడు.

సంస్కృత శ్లోకాలలో నున్న ఒక విలక్షణమైన రచనావిధానం – ఒకే శ్లోకములో ఒకే వ్యక్తిని అనేక మార్లు ప్రస్తావించుట. దీన్ని కూడా నన్నయ రచనలో చూడవచ్చును:

కశ్యపుడను బ్రాహ్మణుడు తక్షకునితో

కం. తక్షకుడను పన్నగుడ ప
రీక్షితు గఱచునటె, నే దరిందము నతనిన్
రక్షింపగ బోయెద, శుభ
దక్షిణు నా మంత్ర తంత్ర దాక్షిణ్యమునన్ (ఆది. 2-187)

స్పష్టముగానే యున్నది (పరీక్షితు, అరిందము, శుభదక్షిణు) నన్నయ కృత భారత భాగమున నిట్టి వనేకము కలవు. ఇది యొక విలక్షణమైన శైలి.

(17వ పేజీ తరువాయి)

కావ్యదోషాలు

అమంగళకరం(అమంగళాతంకదాయి) కావ్యాలంకార చూడామణిలో విన్నకోట పెద్దన అశ్లీలాన్ని ఇలా మూడు విధాలుగానే వింగడించి చూపాడు సోదాహరణంగా. ఆ లక్షణ ఉదాహరణలను పరిశీలిద్దాం.

వ్రీడామంగళకుత్సలు
దోడుగ **నశ్లీల** మనెడు **దోషము మూఁడై**
జాడపడు గ్రామ్యవచన
క్రీడల, నత్తెఱఁగ కృతుల గేలింజేయున్ (కావ్యాలంకార చూడామణి 6/88)

వ్రీడాశ్లీలం సిగ్గుపడ జేసేది –
జనపతి కృప మదయుతులై
చను కుజనులు **గుహ్యకేశ** సన్నిభులును మో
హనరసరుచిపరిపూర్ణులు
నన వ్రీడాశ్లీల దోషమగు వినుచోటన్

ముని **నాకిచ్చిన**పూవుచందమును నే మున్నాడి యీభోజనం
దన కర్పించిన జాడయుం దెలియఁ జెంతం బొంచి వీక్షించి పో
యినసాత్రాజితిబోటి నావలనఁ దా నేనేమి కల్పించెనో
యని ప్రద్యుమ్నుని మౌనిదండనిడి చింతాయత్తచిత్తంబునన్

అమంగళాశ్లీలం – అశుభాన్ని స్ఫురింపజేసేది
అన్నున కధిపతి యలుకం
గన్నుల నీరొలుక బట్ట గడు దడిపె ననం
గ్లిన్న శ్మశాన మన్న
ట్లెన్నేరని పలుకమంగళాశ్లీల మగున్

జుగుప్సాశ్లీలం – ఏహ్యతను కలిగించేది
నాతి గనయంబు వదలింప నాథు మీఁద
నాభిపంకజగంధ మున్నతిఁ జరించె
నన జుగుప్సాభిధాశ్లీల మయ్యె నింతి
కపుడు పొక్కొలి రొంపి కంపర్థమగుట

ఇంతవరకు మనం సభ్యతాపరిధిలో అశ్లీలదోషాన్ని పరిశీలించాం – అచ్చపు అశ్లీల కవిత్వం కవిచౌడప్ప శతకం, చంద్రరేఖావిలాపం, క్రీడాభిరామం, శృంగారచాటువులు, బ్రహ్మానందశతకం, లంబోదరప్రహసనం, రామావధూటీ తారావళి, గణపతీయం, శష్పవిజయం – వగైరాలలో వీరవిహారం చేసింది.

ఈనెల అంశం: తొలకరి

డా.శాస్త్రుల రఘుపతి, హైదరాబాద్

తొలకరి జల్లు జీవులకు తోషము గూర్చగ, పృథ్వి యంతయున్
లలితములైన రీతుల వరమ్ములఁ బోలు తృణాంకురప్రభల్
పలువిధ కాంతి పుంజముల వర్ధిలఁ జేయగ, కర్షకాళి క
న్నుల విరియన్ ముదమ్ములు వినూత్న ఫలప్రద సూచకమ్ములౌ

విలసిత మైన భంగులను వేల్పుల, మ్రొక్కులు మ్రొక్కి సాగు, నా
హలికుల భావి స్వప్నములవన్నియు వాస్తవ రూపుదాల్చునో?
కలలుగ నిల్చి పోవునో! సకాలమునన్ జలసంపదాప్తి, వా
నలు కురిపించు కాలుని వినమ్ర విలాసములన్ కనంగనౌ

జలజల పారు ఏఱులును, సంద్రములం దలపింప జేసి స
త్ఫలముల గూర్చ నీరును ముదమ్మున లోన ధరించి, వారి ధా
రల కను విందు సేసెడు సరమ్ముల, నిర్ఝర జాల మూలమౌ
తొలకరికిన్ ప్రణామముల తొల్త ఘటింతు, హిత ప్రదాతకున్

గలగల పారు నిర్ఝరులు గానములన్ వినుతింప, నింగిలో
అలరు తటిల్లతల్ భువి, వియత్తలమున్, మురిపింప జేయగా
విలయపు తాండవ ప్రథిత భీకర దర్దుర గర్జనార్భటుల్
తొలకరికిన్ సరమ్ములుగ తోయజ గర్భుని లీలలౌనొకో

అల జలదమ్ములొప్పగనె అందములౌ తమ నాట్య భంగిమల్
లలితములైన రీతుల విరాజితమై కనువిందుసేయగా,
అలరు మయూర జాలముల ఆర్భటముల్ ప్రకృతీ లలామకున్
తొలకరి కూర్చు కానుకల తోరణముల్, జన సంభ్రమమ్ములౌ

శిష్లా వి ఎల్ ఎన్ శర్మ, హైదరాబాద్

తొలకరి యేగుదెంచె నదె తోషపు గాలుల దూగి రాగమై
యలమె వియత్తలంబున విహారము జేసెడి దూదిమబ్బులం
దెలమి మనోజ్ఞతల్నిలిపి యిచ్చగ జేరిన దేరువాకకై
కలిమిని బంచి రైతుగణ కామితమై చెలువంపు జల్లులై!

కారుమొయిళ్ళ దాగికొని కర్షకులందరి కోర్కెదీర్చగా
జేరెడి వర్షబిందువులు ల్లెడి హర్ష విహారతీరమున్
జేరగ రైతుమానసము చేరువ నేగును మాగిలింగనన్
తీరుగ నారు బోయగ మదిన్దలపోయగనెంచు ప్రేమమున్!

ఆ కమనీయ కాలమున నాటల నాడును పల్లవంబులున్
సోకెడి పిల్లగాలులిడు సోయగమందుచు నాట్యమాడు నా
రాక సుఖమ్ము నీయగ విరాజిలి కొమ్మలగూడి తూగుచున్
మాకవి విందుజేయు నవమంజుల హాసవిలాసవేదికన్!

తొలకరి సొగసరి కులుకుల
నిలబడినది కళలనిలిపి నిజపథ మందున్

ఖండ-శర్కర

నిర్వహణ: శతావధాని ఎం.వి. పట్వర్ధన్
శతావధాని చేపూరి శ్రీరామ్

మెలపులె యమరెను ప్రకృతిని
తలపుల మధురత నిలుపుచు దనరెడిరీతిన్!

చేరువజేరు నా ఋతువు చేతననింపుచు చిన్కుజిన్కునన్
జేరెడి ముత్తెమై మెరిసి సాంద్రపు గాలి ధ్వనింప మేదినిన్
కోరెడివారి చిత్తమున కూరిమినందుచు మేఘవృష్టియై
దీరి పొలాల దాహమును దీర్చ కృషీవలులంద సంపదల్!

శ్రీనివాస్ లింగం, దుబాయ్ (పిఠాపురం)

కం. తొలకరి చినుకుల సవ్వడి
గలగల గజ్జల రవమయి కమ్మని స్వరమై
పలుకంగనె కర్షకులకు
గలుగును సంతసము సేద్య కార్యము నందున్!!

ఉ. వేగము తోడ చద్దులను వేడ్కగ భార్యలు గట్టి యీయగా
లోగిలి యందు కర్షకులు లుప్తము చేయుచు నిద్ర మత్తునున్
నాగలిఁ జేత బట్టి మరి నాల్గవఝామున సంబరమ్ముగన్
సాగుచు చేలు దున్ని వ్యవసాయ మొనర్చెద రన్నదాతలై!

చ. తొలకరి జల్లు వేళ, భువి తొల్లి సువాసనఁ బంచు వేళలో,
వెలుగులయిక్కఁజూచి, అరవిందములే వికసించు వేళలో
పలుకక పక్షులెల్ల తమ వాసము లందున నక్కు వేళలో,
పొలమునఁ జేరి కర్షకులు భూమికి మ్రొక్కుచు దుక్కిదున్నరే!

తే.గీ. అలసటన్నది మరచి ఐదారు నెలలు
శక్తికొలది వారెల్లరు శ్రమనుదీర్చ!
పంట సంక్రాంతినాటికి పండి, నిండు
రైతులిండ్లలోన సిరుల రాశులెన్నొ!

సీ. ధాన్యపు రాశులు తరగక, జనులెల్ల
ఆకలన్నది లేక అలరు నపుడు!
వేళకివ్వధముగ వెల్లువై వర్షించి
పంట సమృద్ధిగ పండుటకును

తదుపరి అంశం

గృహలక్ష్మి

పై అంశానికి 5 పద్యములను 9441039146
ఫోన్ నంబరుకు వాట్సప్ ద్వారా పంపగలరు
ఖండికలు పంపవలసిన ఆఖరు తేది 15 ఆగస్టు 2026

రక్షించవలెను బర్యావరణంబును!
దేవతలకును బ్రీతినొనరించ
యాగములెల్ల జేయవలెను సతతము!
త్రుంచక చెట్లను బెంచవలెను!
ధార్మికముగ జీవించుచు దానములను
జేయవలయును! ధరణిపై చెరువులను న
దులను రక్షించ వలె భక్తితోడ జుమ్మి!
తొలకరికిక లోటుండదు తొంగిచూడ!!

రాకుమార, గోదావరిఖని.

తే.గీ. నైరుతిఋతుపవనములు చేరువౌచు
ధరణిని సెగలపీడను తరిమి వైచి
నలుదెసలను తొలకరియై పలుకరింప
ప్రకృతిసుకృతమనంబున పరవశించె.

తే.గీ. కంకణముగట్టి కాడిని గౌరవించి
కరుణహలికుడెద్దులకు పొంగలిని బెట్టి
చెలిమియౌ ములుకోలను చేతబట్టి
ముదమున తలపాగాజుట్టి పదముకదిపె .

తే.గీ. ఆరుగాలముకష్టించియార్తితొలగ
చేలగట్టుదేవరలపూజించి,నేల
తల్లియొసగెదుపంటల దయనుగల్గి
ఏరువాకసుఖింతురు సైరికులును.

తే.గీ. కలతనొందెదుధారుణి పులకరింప
మంచుముత్యపురాసుల మైత్రినెంచి
గగనతలమునువిడనాడి కారుమొయిలు
నెలతచిరునగవట్టుల చిలుకరించె.

తే.గీ. చేవగలజీవజాలపు తావులెల్ల
మండుటెండలధాటికి మాడిపోవ
శాపగతినొందుజగతిని సంస్కరింప
బ్రతుకుతెరువునువరమిడె వర్షరాజ్ఞి.

పెనుకొండ రామబ్రహ్మం బెంగుళూరు

చ. చెలఁగుచు చిత్రభానుఁడటు చిందులు త్రొక్కుచుఁ జంద్రనిప్పులన్
మెలఁపుగఁ జల్ల నుగ్రుఁడయి మేదిని వేడిమి బాధ మీరఁగన్
విలవిలలాడు చుండు తఱి విహ్వల మొందుచు సైఁచఁ గష్టమై
దొలకరి జాలువాఱఁ గను తోరపు మోదముఁ దెల్ప శక్యమే
మనోజ్ఞము తొలకరి జల్లు స్రవించు తోయపు హాయితోఁ
బులకలఁ గాంచు తపించి పోయిన నేలయే
జలజల రాలెడు ధార చల్లఁగఁ జేయఁగన్
వలచిన ప్రేయసి కోరి వచ్చిన రూపునన్

మాలిని ఇలఁ దొలకరి హర్షంబిచ్చు సంప్రీతిఁ దెల్పన్
దలఁపులు ఫలియించన్ దన్వి సిద్ధించు నట్టుల్
వలపులఁ గను భక్ష్యప్రాప్తి యేతీరుగా నాఁ
కలి కుతిలము మాన్పన్ గాచి యా రీతి వెల్గన్

మధురాక్కర అకృత మొనరించక మనఁగ నవనిని జనులు సదా
సుకృత మేపారు చినుకుల సొబగునఁ దొలకరికి
వికృత తాపము పలుకఁగ వీడ్కోలు పరవశించఁ
బ్రకృతి పర్యావరణమెప్డుఁ బచ్చదనము విరియు

మహాక్కర
బీడు భూములఁ దొలకరి చినుకులఁ బ్రియముగ తడిసినఁ బులకించుచు
వేడిమి యణఁగార చిగురించి తనిసి వెలయు తృణపు పలు పొదల జతఁ
గూడి నర్తించుఁ బ్రకృతి పరవశించు గుబురులు చెలగుచుండ విరివిగఁ
జూడ వనమువోలె నగుపించు వరలు శోభల విందు సేయుఁ గనులకు

అసనారె, హైదరాబాద్

తొలకరిఁ గల్గువర్షములతో మడిదున్నిన నిశ్చయమ్ముగా
కలుగును హర్షమెల్లపుడు కర్షక కోటికి, గడ్డిజాతి మొ
క్కలు నశియించ, నాటుకొన గానగు మేలగు పైరులిచ్చతో
సులభముగా చిగుర్చియవి శోభను గూర్చు పొలమ్మునందునన్

ముందుగ నాట మొక్కలను పోడిగ వర్ధిలి పైరులన్నియున్
సుందర మైన రూపమున, చొప్పడ జేయు ఫలమ్ము హెచ్చుగా
నందును హెచ్చు రాబడులు హాలిక జాతికి విక్రయమ్ముతో
పొందగ వచ్చు నల్పమగు మూల్యమునన్ వినియోగదారులున్

వర్షాధారపు భూమికిన్ దొలకరిన్ వర్షించు మేఘమ్ములే
తర్షమ్మున్ శమియింప జేయగను క్షేత్రాజీవులున్ బంటలన్
హర్షమ్మొందుచు నాటుచున్నధికమౌనాపేక్షతో పెంచగా
మర్షమ్మున్ గొని తప్పకుండ కలుగున్ మాన్యమ్ములన్ రాబడుల్

తరణి యొసంగు వేసవి క్షతమ్ములతో భువి వ్రయ్యవాఱగా
వరుణుడు గాయముల్ జెరప వర్షములన్ గురిపించు ధాటిగా
తరుణమునందు రైతులకు తద్దయు హర్షము నంద జేయగా
పరవశమొంది కర్షకులు పంటలు వేయుచు మించుచుండెడిన్

దొరువులు నిండిపోవగను తోరముగా దొలి వర్షముల్ బడన్
దొరకును స్వచ్ఛ నీరములు తోషము గల్గు ప్రజాళి కెల్లెడన్
నిరతము చల్లగాలులవి నేరుగ వీచుచు గ్రామసీమలన్
హరుసము నీయగా, హదను నంబువు లందును పంటభూమికిన్

అవధాన కల్పవృక్షం

సత్కవి ప్రతిభకు తార్కాణం - సమస్యా పూరణం

- శతావధాని డా॥ జి.యం. రామశర్మ

సంస్కృతాంధ్రాలలో సమధిక సంఖ్యలో అష్ట,శతావధానాలు ఆశుకవితాసభలు నిర్వహించిన విద్వత్కవులలో ప్రకాశం జిల్లాకు చెందిన శ్రీ. పిసుపాటి చిదంబరశాస్త్రి గారు (1892–1951) ప్రఖ్యాతులు. గీర్వాణ వాణీ కోవిదులైన పలువురు గురువుల సమక్షంలో సంస్కృత కావ్యనాటకాలను –వ్యాకరణాలంకారాది వివిధ శాస్త్రాలను సాకల్యంగా, అభ్యసించిన చిదంబరశాస్త్రి గారు తెలుగు నేలలోనే కాక బెంగుళూరు వంటి ఆంధ్రేతర రాష్ట్రాలలో కూడ అవధాన సాహితీ పరిమళాలను గుప్పించారు. వారు తన అవధానంలో ప్రప్రథమంగా ఛందోభాషణాన్ని ఒక అంశంగా చేర్చుకొని సరసంగా సమర్థంగా నిర్వహించారు. చిదంబర శాస్త్రిగారు సంస్కృతంలో 10 గ్రంథాలు, తెలుగులో 26 గ్రంథాలు రచించి సాహిత్యాన్ని సుసంపన్నం చేసారు. వేదవ్యాస కృత పద్మపురాణాన్ని తెలుగు పద్యాలలోనికి అనువదించి విశేష కీర్తిని గడించారు.

వారికి విజయవాడ శతావధాన సభలో ఒక విచిత్రమైన సమస్యనిచ్చారు. అది

'కాఖాగాఘా కీజ కాటన్నాయ టీజ'

ఇది ఒక అర్థరహితమైన సమస్య, పైగా ఏ ఛందః సంబంధి పాదము కాదు. శాస్త్రిగారిలా పూరించారు.

పూరణ

కాఖాగాఘా కీజ కాటన్నాయ టీజ
చాఛా జాఝు చీజ చంచన్నాయ ఛీజ
తాథా దాధా తీజ తాతన్నాయ థూజ
పాఫా బాభా పీజ పాపన్నాయ ఫీజ

ఈ పూరణ వినేసరికి పృచ్ఛకుడు విస్తుపోయాడు. అంతలోనే తేరుకొని ఈ పూరణకేమైనా అర్థమున్నదా అని అవధానిని అడిగాడు. అప్పుడు మీ సమస్యకు అర్థముంటే నా పూరణకు అర్థముంటుంది – అన్నారు అవధానిగారు.

సమస్యార్థాన్ని పృచ్ఛకుడిలా వివరించ సాగాడు. పూర్వము కాటన్నాముడనే లుబ్ధాగ్రేసరుడైన ఒక ధనికుడుండేవాడు. అతనికి విద్యాగంధం అబ్బలేదు. అయితే అందరి చేత బాగా పొగిడించుకోవాలనే తపన ఉండేది. అతని మనస్తత్వాన్ని బాగా గుర్తించిన ఒక చతుర పండితుడు ఈ కాటన్నాముడి దగ్గరకు వెళ్ళి పై సమస్యను గానం చేసి సత్కారాన్ని పొందాడు.

పై కట్టుకథనంతా సావధానంగా విన్న శాస్త్రిగారు –

"ఈ విశాల విశ్వంలో కాటన్నాయుని వంటివారే మరో ముగ్గురున్నారు – వాళ్ళే చంచన్నాయుడు, తాతన్నాయుడు మరియు పాపన్నాయుడు. ఈ ముగ్గురిని కీర్తించిన మా పండితుడు మీ పండితుని కన్నా బుద్ధిశాలి చమత్కారి కూడా. అందుకే ఛీ, థూ, అని అన్యాపదేశంగా నిందిస్తూనే పొగిడినట్లు భాసింపజేసి సమ్మానాన్ని పోందాడు" అని విడమర్చి చెప్పేసరికి శాస్త్రిగారి సద్యః కల్పనాశక్తికి సభలో చప్పట్లు మ్రోగాయి.

ఇచ్చిన సమస్యాపాదము యొక్క లయను అనుసరిస్తూ. అక్షర క్రమాన్ని గమనిస్తూ మిగతా మూడు పాదాలను పూరించడం అనేది ఇక్కడ విశేషాంశం. ఇది శాస్త్రిగారి సూక్ష్మేక్షికతకు నిదర్శనం.

చిదంబరశాస్త్రి గారికే సికింద్రాబాదులో జరిగిన అవధానంలో – **సోముని మంత్రంబు పృథకు సూనుల నిచ్చెన్** అను సమస్యనిచ్చి పూరించుమన్నారు. 'చంద్రుని (లేదా శంకరుని) మంత్రము కుంతికి కొడుకులను ప్రసాదించింది' అని సమస్యకర్థము – ఇది అసంగతము. దీన్ని అవధాని వైదుష్యభరితంగా ఇట్లా పూరించారు.

కం॥ నేమమున మున్ను శుశ్రూ
షా మహిమంబునను సంతసము గలిగింప
గా మెచ్చి యిడిన, దుర్వా
సోముని మంత్రంబు పృథకు సూనులనిచ్చెన్

'సోముని' అన్న పదంలో అవధానికి దుర్వాసోముని స్ఫురించాడు. సంస్కృత వ్యాకరణ పరంగా 'దుర్వాసస్' శబ్దము సకారాంతము. దుర్వాసస్+ముని = దుర్వాసోముని అను రూపము సిద్ధిస్తుంది.

ఇట్లా కాకుండా వేరే ఏ విధంగా ఈ సమస్యాపూరణం గావించినా అది ఇంత సమర్థనీయము కాదు. ఈ పూరణ చిదంబరశాస్త్రి గారి వ్యాకరణ శాస్త్ర దక్షతకు అద్దం పడుతున్నది. పద్య భావము సుగమము.

పద్యపరిమళం

పాలిండ్లు కదలగ బసపు పయ్యెద వీచు
 నచలాధిపతి కూర్మి యాడుబిడ్డ
ధూత్కారమొనరించి తొండంబు ముక్కున
 శీకరాసారంబు జిలుకు డుంఠి
ప్రత్యక్షమై వచ్చి భాగీరథీ గంగ
 మృదుల హస్తము సాచి మేను నివురు
బ్రమథోత్తముడు భృంగి భయ రక్షణార్థంబు
 ఫాలాగ్రమున దీర్చు భసిత రేఖ
దక్షిణ శ్రుతి మీదుగా ధాత్రి ద్రెళ్ళి
పెద్ద నిద్రకు బ్రాగన్ను పెట్టు వేళ
బంచ జనులకు దారక బ్రహ్మవిద్య
యభవుడుపదేశ మొనరించునపుడు కాశి

మరణం చివరి చరణం కాదు అని అలిశెట్టి ఏ ఉద్దేశ్యంతో చెప్పాడో కానీ, సెలబ్రేట్ ద డెత్ అని ఆధునిక పాశ్చాత్య భావనలు చావును ఆనందించమని చెప్పినా, పరిపూర్ణతకు కావలసింది జీవంలోని చైతన్యం, మరణంలోని నిశ్చలత. ఈ సృష్టి తత్త్వమే జీవిస్తున్న మరణం అని సద్గురు జగ్గీ వాసుదేవ్ నుడివినా...

ఏనాడో అంతకన్న అందంగా, ఆనందంగా, భగవద్విషయంగా చావును శివైక్యం గా భావించారు మహాకవి శ్రీనాథుడు..

ఈ పద్యం శ్రీనాథుని కాశీ ఖండంలోనిది.

కాశీలో మరణించినపుడు గోచరించే అలౌకిక ఆనందమయ దృశ్యం వర్ణిస్తున్నారు.

కాశీలో ప్రాణ నిర్యాణ వేళ యందు ప్రాణులన్నియు కుడిచెవి మీదగునట్లు నేలపై వ్రాలిపోయి దీర్ఘ నిద్రకు బ్రాగన్ను పెట్టును. ఆ సమయంలో పరమ శివుడు సపరివారం గా విచ్చేసి ఆ ప్రాణుల కుడిచెవి యందు ప్రణవోప దేశమొనర్చును.ఆ సమయంలో అమ్మవారు వాత్సల్య క్షీరభరితములైన పయోధరములు కదులు చుండగా తన పసపు పయ్యెదతో ఆ ప్రాణికి అల్ల న వీచుచుండును.డుంఠి విఘ్నేశ్వరుడు మృత్యు భయం పోవునట్లు ధూత్క రించుచు తన తొండపు కొసతో చల్లని నీటిజల్లు చిలుకు చుండును.భాగీరథీ గంగ సాకారయై వచ్చి తన మృదుల పాణి తలముతో కలయ నివురుచుండును. ప్రమథోత్తముడైన భృంగీశ్వరుడు వచ్చి భయము దీరునట్లు నొసలిపై భసిత రేఖను దీర్చుచుండును.

బ్రతుకు లోని యెల్ల అనుబంధములకు చివరి వీడ్కోలై మహా భయంక రమైన మృత్యువును, చరమ విశ్రాంతిని, ఇంత స్పృహణీయంగా చెప్పిన ఇంకొక కవి సంస్కృతాంధ్ర వాఙ్మయం లో లేదని కవి వతంసుల సాభిప్రాయం.

మరణమను మలిసంజలో, దీర్ఘనిద్రారంభ వేళలో, ప్రాకృతములైన అనుబంధములన్నియు క్రమ క్రమముగా మాసిపోవును.అందులో మొదటిది తన అస్థిత్వమునకు కారణమైన తల్లి. ఆ పిమ్మట పినతల్లి. అటు పిమ్మట ఆప్తసఖుడు. ఆపైన తండ్రి. ఇవన్నీ శాశ్వతములైన దివ్యానుబంధములుగా మాఱుచున్న అద్భుత పరిణామం. ఇక్కడ తల్లి అంటే జగన్మాత. సకల చరాచరాల ను తన కృపాకటాక్ష వీక్షణా లతో పాలించే చల్లని తల్లి. డుంఠి విఘ్నేశ్వరుడు అన్న. గంగానది పినతల్లి. భృంగి ఆప్తసఖుడు. పరమశివుడే కన్నతండ్రి.

కాశీఖండం లోని పరమార్థ మంతయు కావ్య మార్గము న పరమ స్పృహణీయంగా ఈ పద్యమున కనులకు కట్టినట్లు చూపించారు శ్రీనాథుడు.

మృత్యోర్మా అమృతంగమయ

- 'శతావధాని' చేపూరి శ్రీరామ్

(13వ పేజీ తరువాయి)

అవధానవేదిక

భారతీతీర్థరూపేణ త్తుఙ్గతీరే విరాజతే।
బ్రహ్మనిష్ఠా శ్రితోద్ధాత్రీ శృంగేర్యాం భాతి భారతీ॥

న్యస్తాక్షరి: ఆరవల్లి శ్రీదేవి

శార్దూలే సంస్కృతభాషా – 1/1–పా,2/5–ఃతి,3/8–నీ,4/3–యం

పార్వత్యా సహనర్తమానపరమేశాత్మోద్భవే మాతృకే
మాతశ్శార్గిణి మే మనో నయతు తే పాదాబ్జయుగ్మే పరే।
దండీద్యాంఘ్రియుగోయి నీరజసునేత్రే హే పవిత్రే నమో
య్యయం త్రిపురే పరాత్పరకళే తత్త్వే పదాంభోరుహమ్వ

ఆశువు: దేశిరాజు సత్యనారాయణమూర్తి

1. ఆగతో వా కిరీట్యత్ర భేద్యం వా తేన యంత్రకమ్।
 ద్రౌపద్యాః చింతనం కృష్ణః ఇదం హరతు సర్వదావ
2. భాగ్యోదయాయ దేశస్య సింధూరతిలకాన్వితా।
 భారతాంబా భవత్వవ్యా దుర్గా దుర్గార్తిహారిణీవ

ఘంటావధానం: మంకాల లక్ష్మీమానస

అప్రస్తుత ప్రసంగం: డా. పి.టి.జి.వి. రంగాచార్యులు

సంస్కృతం-సంస్కృతి 11

నారుమంచి వేంకట అనంతకృష్ణ శర్మ

ధాతురూపమంజరీత్యాదులతో నిత్యానుసంధానము వలన అవి హృదయస్థమై అలవోకగా ప్రయోగించే సామర్థ్యాన్ని అవధాని పొంద గలడు. ఇక ఈ సంచికలో ప్రయోగవిశేషాలను, అర్థము ఎలా తెలుస్తుందో ఇలాంటి కొన్ని ఆలంకారికమైన అంశాలు తెలుసుకుందాం.

పద్యము అంటే కేవలం గణములకు సరిపడా పదాలను పొదగటం కాదు కదా. మరి కావ్యాత్మతో పద్యరచనకి కావలసిన వస్తువు తెలియాలిగా. దానినే ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసము అంటారు. ప్రతిభ సహజమైనది, జన్మతః సంస్కారరూపముగా వచ్చినది. వ్యుత్పత్తి అన్నది లోకవ్యవహారమును నిశితముగా గమనించుట, శాస్త్రములను అధ్యయనము చేయుట, పలువిషయాలను తెలిపే గ్రంథాలను గమనికతో చదువుట. నిఘంటుశోధన, ఉత్తమ కావ్యాలను చదువుట అందులోని విశేషాలను ఆకళింపు చేసుకొనుట. అలాగే కావ్యహృదయము తెలిసిన పెద్దల వద్ద శిక్షణ తీసుకొనుట, సవిమర్శగా చదివి లోతులు తెలిసికొనుట అభ్యాసము అంటారు. ఇలా పూర్వకవి సాహిత్యము చదువుట ద్వారా కవిలోని సహజ సంస్కారము సానపెట్టబడి రసవంతమైన సందర్భసహితమైన పద్యరచనలో ప్రావీణ్యము వస్తుంది. ఇది ఒక కోణం.

ఇక్కడ సహజముగా ఒక సంశయము రావచ్చు. నాకు సహజ మైన ప్రతిభ లేదు కనుక నేను పద్యరచనకు అనర్హుడనా? అని. ఇది తప్పు భావన. హెచ్చుతగ్గులన్నది స్థాయీభేదమే తప్ప సహజమైన ప్రతిభ అందరిలోనూ ఉంటుంది. అది గమనించవలెనంతే. కానీ వ్యుత్పత్తి, అభ్యాసము మన సాధనపైన ఆధారపడి ఉంటుంది. పైగా మన సహజసంస్కారపు లోటుపాట్లను అధిగమింపచేసి కావలసిన ముడిసరుకును అందించి కవిగా మరుస్తుంది.

ఇక కవిత్వపు స్థాయిలను చూద్దాం. పద్యము కొన్ని శబ్దముల కలయిక మాత్రమే కాదు. ఆ శబ్దముల అర్థములు కూడా ఉంటాయి, ఆ అర్థములే మనకి భావస్ఫురణ కలిగిస్తాయి. కనుక శబ్దము, అర్థము కూడా దోషరహితముగా ఉండేలా చూసుకోవడం మొదటి పని. తరువాత ఆ శబ్దములు కానీ, అర్థములు కానీ కొంత అలంకరించవచ్చా అన్నది తదుపరి అంశం. అవే శబ్దాలంకారాలు, అర్థాలంకారాలు. ఇవి తెలుగులోనికి సంస్కృత ఆలంకారిక గ్రంథాల నుంచి తెచ్చుకున్నవే. కనుక మూలమైన సంస్కృత అలంకారశాస్త్ర గ్రంథాధ్యయనము ముఖ్యమైనది. కొన్ని సందర్భాలలో అలంకారం కుదరకపోవచ్చు కానీ రససృష్టి జరుగవచ్చు. కానీ ఆలంకారికులు కేవల శబ్దార్థాలంకారాలతో ఉన్న పద్యాన్ని అధమమైనది అన్నారు. అధమము అంటే పనికిరాదని కాదు, కవి గొప్పదనాన్ని తేట పరచనిది అని. అలాగే శబ్దములు తమ అర్థాన్ని బోధపరుస్తూ కూడా శబ్దార్థముల కన్నా భిన్నమైన విశేషమైన అర్థాన్ని మాత్రమే బోధ పరుస్తే అది మధ్యమమన్నారు. అసలు పలికిన శబ్దములు, అర్థములు విడిచిపెట్టేసి విశేషమైన కొత్త అర్థాన్ని బోధించేలా వ్రాస్తే దానిని ఉత్తమమైనది అన్నారు.

శబ్దములు, అర్థములు కేవలము తమ భావాన్నే తెలుపుతాయా అంటే, కాదు అనాలి. అవి వాటికన్నా భిన్నమైన అర్థాన్ని కూడా స్ఫురింపచేస్తాయి. ఉదాహరణకి మీ ఇల్లెక్కడ అంటే 'మా ఇల్లు మేయిన్ రోడ్డు మీదే' అంటాడు అవతలి వాడు. విన్నవాడు పొరపాటున కూడా రోడ్డు మధ్యలో ఇల్లు కట్టుకున్నాడు అనడు కదా. మేయిన్ రోడ్డు కి పక్కన అని అర్థాన్ని మాత్రమే తీసుకుంటాడు కదా. రోడ్డు కాస్తా రోడ్డు పక్కన అన్న అర్థం ఎలా వచ్చింది. రోడ్డు అంటే కుదరదు కనుక. దానికి సంబంధించినది కనుక. అలాగే అలా అర్థం చెప్పుకుంటేనే రోడ్డు గొప్పదనాన్ని తన ఇంటికి జత చేయగలుగుతాము కదా. శబ్దార్థముల స్వంత అర్థాన్ని వదిలేసింది.

ఇంకొక సందర్భం చూద్దాం. పిల్లాడి ప్రోగ్రెస్ రిపోర్ట్ చూస్తున్న తండ్రి పిల్లాడికి చాలా తక్కువ మార్కులు వచ్చాయని గమనించాడు. కానీ తండ్రి పిల్లాడిని తిట్టలేదు. ఇప్పుడు తండ్రి మాటలు వినండి. 'నాన్నా భలే వచ్చాయిరా మార్కులు. ఎలా వ్రాసావు ఇంతబాగా' అన్నాడు. ఇందులో ఒక్క శబ్దము కూడా తన అర్థాన్ని బోధపరచడం లేదు. శబ్దములో పొగడ్త, కాని విన్నవానికి అర్థమైనది నిందించడం. ఇలా వేరే అర్థబోధ కలగటానికి కొన్నిసార్లు శబ్దము కారణమైతే, కొన్నిసార్లు అర్థం కారణమౌతుంది.

శబ్దం కారణమౌటకు కలయిక కావచ్చు. సచక్రః హరిః అన్నారనుకోండి. హరి అంటే విష్ణువు, సూర్యుడు, కోతి, సింహము అని అనేకార్థములున్నా, చక్రము అన్న శబ్దముతో హరి అన్నాము కనుక విష్ణువు అన్న అర్థం రూఢి అవుతుంది. అలాగే విడిపోవడం వల్ల, కలయిక వల్ల, ప్రయోజనము వల్ల, సందర్భము వల్ల, ఇలా పలు రకాలుగా శబ్దము అర్థాన్ని నియంత్రిస్తుంది.

కొన్ని సార్లు శబ్దము యొక్క అర్థము వల్ల కూడా అర్థం నియంత్రించ బడుతుంది. మనకి అనుభవమే కదా... మనం అన్న ఒక మాట అవతలవారికి వేరేలా అర్థమౌతుంది. మాట్లాడిన వాడి ఉద్దేశం, విని అర్థం చేసుకునేవారి ఆలోచన, బయటనుంచి విన్నవాడికి అర్థమౌట ఇలా అనేక విధాలుగా అర్థం నియంత్రించబడుట గమనించవచ్చు.

ఇక్కడ అర్థం చేసుకోవలసినది అవధానిగా ఇవన్నిటిపైనా చక్కటి పట్టు సాధిస్తే అవధానపద్యాలకు ఉన్న ఒక అపప్రథ 'అది అవధానపద్యం' అంటే నిస్సారమైనది అన్న అభిప్రాయాన్ని దూరంచేసి, అవధానములో కూడా లోకహితమైన, సామాజికదృక్పథముతో పద్యం చెప్పవచ్చునని చెప్పినవారౌతారు. ఈ విషయాలు బాగా ఆకళింపు చేసుకుని, నిత్యానుసంధానం చేస్తుంటే అలవోకగా ఈ విషయాలు అసంకల్పితముగా అవధాని పద్యాలలో వచ్చి కూర్చుంటాయి.

11-07-2026, శ్రీ భారతీ తీర్థ గ్రంథాలయం , దర్శనమ్ పత్రిక కార్యాలయంలో,
నెలనెలా అవధాన దర్శనమ్ కార్యక్రమంలో భాగంగా జరిగిన
చి. నరసింహదేవర జయలక్ష్మి సంస్కృత అష్టావధానం - సమ్మానదృశ్యాలు

అవధాన విద్యా విజయతే తరామ్

నందామశరదశ్శతమ్

అవధాన పుష్కరిణి పద్యవిద్యాభిమానులందరి ఆశీస్సులతో మలి శరత్తులోకి ప్రవేశించబోతుంది. ఇంతవరకు ఆన్లైన్ పత్రికగా వెలువడిన ఒక సంవత్సరం సంచికల సమాహారంగా అవధాన పుష్కరిణి వార్షిక సంచికను ఒక మేలిమి గ్రంథంగా ప్రచురించనున్నాము. బహుశా ఇది 250 పేజీల పైచిలుకు గ్రంథంగా రావచ్చు. అవధానానికి సంబంధించిన అనేకవిషయాలపై విద్వద్వరేణ్యులైన కవిపండితులు స్వచ్ఛందంగా పుష్కరిణికి రచనలందించారు. వారి సౌజన్యానికి నమోవాకాలర్పిస్తున్నాము. కొందరు పాఠకులు ఆన్లైన్‌లో చదవలేక ప్రతిసంచికను ప్రింట్ తీసుకొని చదివి దాచుకుంటున్నారు. ఎందరో పత్రిక విషయసమగ్రంగా ఉందనీ చదివిదాచుకోదగినదనీ ప్రశంసిస్తున్నారు. భావితరాల అవధానులకు ఈ పత్రిక ఒక కరదీపిక కావాలన్నదే మా ఆకాంక్ష. అందుకే అవధాన విద్యా వికాస పరిషత్ పక్షాన వార్షికసంచికగా లిఅవధాన పుష్కరిణిలి ని గ్రంథరూపంగా తెచ్చే సాహసం చేస్తున్నాము.

ఇందుకు మీ చేయూత అవసరం. ప్రచురణపూర్వ విరాళంగా రూ.200/- (ఆపై మీఇష్టం) అందించిన వారందరికీ ఈపుస్తకం అందిస్తాము. విజయదశమి సందర్భంగా గ్రంథావిష్కరణ జరిపించి అందించాలని యోచిస్తున్నాము.

- సంపాదకులు

Published by
Avadhana Vidya Vikasa Parishat
Sri Rama Sadanam, 29-1499/6/1, Road No.1
West Kakatiya Nagar, Neredmet, Secunderabad - 500056
Ph: 9441039146